TELANGANA RISING
CURE - PURE - RARE

www.hamsakalam.com
PRGI: TGTEL/26/A3129
సంచలన తెలుగు దినపత్రిక
హంస కలం వార్త
HAMSA KALAM VARTA
చీఫ్ ఎడిటర్: వడ్ల మధుసూదన్ చారి



EDITOR :VADLA MADHUSUDHAN CHARY MEDCHAL /MALKAJGIRI VOLUME:1 ISSUE:22 MONDAY ,JUNE 1,2026 PAGES:8 COST: 4 /-

ఎడిటర్ : వడ్ల మధుసూదన చారి మేడ్చల్ /మల్కాజిగిరి సంపుటి : 1 సంచిక : 22 సోమవారం 1 జూన్ 2026 పేజీలు :8 వెల: 4/-

# రూ.5.20 కోట్లతో కొండాపురం

## పొన్నెకల్లు రోడ్డు పనులకు శంకుస్థాపన..



హంసకలం వార్త మే 31

ప్రజల ఆశీర్వాదంతో ఏర్పడిన ప్రజా ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని రెండు కళ్లుగా చేసుకుని ముందుకు సాగుతోందని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మం రూరల్ మండలం కొండాపురం గ్రామంలో రూ. 5. 20 కోట్ల వ్యయంతో పొన్నెకల్లు నుండి కొండాపురం వరకు నిర్మించనున్న బీటీ రోడ్డు పనులకు ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. - మిగతా 2లో

# ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ అమలు పై

# సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష

హంసకలం వార్త మే 31

తెలంగాణ ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు 'ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్' అమలుపై సీఎం రేవంత్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాన్ని ఎంప్లాయీ హెల్త్ కేర్ ట్రస్ట్ ద్వారా అమలు చేయాలని సీఎం రేవంత్ నిర్ణయించారు. ట్రస్ట్‌లో ఉద్యోగ సంఘాల నుంచి ఆరుగురు ప్రతినిధులకు, పెన్షనర్ల నుంచి ఇద్దరు సభ్యులకు అవకాశం కల్పించాలని నిశ్చయించారు. ప్రభుత్వ ఉద్యోగినే ట్రస్ట్ సీఈవోగా నియమించాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు ట్రస్ట్ కమిటీని ప్రకటించే అవకాశాలు కనిపిస్తున్నాయి. మరోవైపు ఉద్యోగులు, పెన్షనర్లకు ఎంప్లాయీస్ హెల్త్ స్కీమ్ కింద సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వం డిజిటల్ హెల్త్ కార్డులు జారీ చేసేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఇప్పటికే ఉద్యోగులు, వారి కుటుంబ సభ్యుల వివరాల సేకరణ ప్రారంభమైంది. డేటా అప్‌లోడ్ చేయాలని గతంలోనే సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసింది. నేటితో ఆ గడువు ముగియనుంది. డేటా అప్‌లోడ్ తర్వాత హెల్త్ కారులు మంజూరు అయ్యే అవకాశం ఉంది. కాగా, ఈ పథకం ద్వారా నగదు రహిత వైద్య సేవలను ప్రభుత్వం అందించనుంది. దీని ద్వారా ఉద్యోగులు, పెన్షనర్ల ఆరోగ్య భద్రతకు రాష్ట్ర ప్రభుత్వం భరోసా కల్పించనుంది.



# రైతుల పేరుతో దుష్ప్రచారం చేయొద్దు..

# కేటీఆర్‌కి ఆది శ్రీనివాస్ వార్నింగ్

హంసకలం వార్త మే 31

మాజీ మంత్రి కేటీఆర్ పై తెలంగాణ ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వ్యవసాయానికి మూడు గంటల విద్యుత్ సరిపోతుందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నట్లుగా కేటీఆర్ తప్పుడు ప్రచారం చేస్తున్నారని ధ్వజమెత్తారు. సీఎం ఆ మాట ఎప్పుడు అనలేదని తేల్చి చెప్పారు. - మిగతా 2లో



# రైతు డిస్కం ఏర్పాటు చేసి మిగతా

# రెండు డిస్కంలు ప్రైవేట్ పరం చేసే కుట్ర

హంసకలం వార్త మే 31

రైతు డిస్కం పేరుతో రేవంత్ రెడ్డి సర్కార్ కొత్త డిస్కం ను ఏర్పాటు చేసి మిగతా రెండు డిస్కంలను ప్రైవేట్ పరం చేసే కుట్ర చేస్తోందని తెలంగాణ రక్షణ సేన చీఫ్ కల్వకుంట్ల కవిత ఆరోపించారు. తాము ఆ ప్రయత్నం చేయటం లేదని ప్రెస్ మీట్ పెట్టి చెప్పే దమ్ము సీఎంకు ఉందా అని సవాల్ - మిగతా 2లో



## ఈటల రాజేందర్ ఫ్లెక్సీల వివాదం..

## రామచందర్ రావు ఏమన్నారంటే...



హంసకలం వార్త మే 31

బీజేపీ మల్కాజ్‌గిరి ఎంపీ ఈటల రాజేందర్‌ని విమర్శిస్తూ ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు, బ్యానర్ల వ్యవహారం పై తెలంగాణ బీజేపీ అధ్యక్షుడు రామచందర్ రావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీజేపీ ఎదుగుదలను చూసి తట్టుకోలేక కొందరు కావాలనే ఇలాంటి చర్యలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. - మిగతా 2లో

## క్యాన్సర్ చికిత్సలో నిమ్స్ మరో ముందడుగు..

## ఖరీదైన పరీక్షలు ఇక ఉచితం




హంసకలం వార్త మే 31

హైదరాబాద్‌లోని నిమ్స్ ఆసుపత్రి క్యాన్సర్ వైద్య రంగంలో సరికొత్త చరిత్ర సృష్టించేందుకు సిద్ధమవుతోంది. క్యాన్సర్ మహమ్మారిని ప్రాథమిక దశలోనే గుర్తించి, రోగికి ప్రత్యేకమైన చికిత్స అందించే లక్ష్యంతో మరో కీలక ముందడుగు వేసింది. అత్యాధునిక 'లిక్విడ్ బయాప్సీ' పరీక్షలను - మిగతా 2లో

## చల్లని కబురు.. మరో పది రోజుల్లో

## తెలంగాణకు నైరుతి రుతుపవనాలు!



హంసకలం వార్త మే 31

భానుడి ప్రతాపంతో అల్లాడుతున్న తెలుగు రాష్ట్రాల ప్రజలకు వాతావరణ శాఖ చల్లని కబురు అందించింది. మరో పది రోజుల్లో నైరుతి రుతుపవనాలు రాష్ట్రాన్ని తాకనున్నాయి. జూన్ 10 నుంచి 12వ తేదీ మధ్య తెలంగాణలోకి రుతుపవనాలు ప్రవేశించే అవకాశం ఉందని వాతావరణ నిపుణులు - మిగతా 2లో

# దిగ్బంధనాన్ని ఉల్లంఘించిన నౌక..

# అమెరికా క్షిపణి దాడి..

హంసకలం వార్త మే 31

ఇరాన్ పై అమలు చేస్తున్న దిగ్బంధనాన్ని ఉల్లంఘించేందుకు ప్రయత్నించిన ఓ కార్గో నౌకపై అమెరికా సైన్యం క్షిపణి దాడి చేసింది. గాంబియా జెండా కలిగిన ఆ కార్గో నౌక ఇరాన్ పోర్ట్ వైపు ప్రయాణిస్తుండగా, అమెరికా సైన్యం పలుసార్లు - మిగతా 2లో



# వియత్నాం చేతికి 'బ్రహ్మోస్' అస్త్రం..

# డీల్ ఖరారు చేసిన భారత్

హంసకలం వార్త మే 31

రక్షణ రంగ ఎగుమతుల్లో భారత్ మరో కీలక మైలురాయిని దాటింది. ప్రపంచంలోనే అత్యంత వేగవంతమైన సూపర్‌సోనిక్ క్రూయిజ్ క్షిపణి 'బ్రహ్మోస్'ను వియత్నాంకు విక్రయించేందుకు ఒప్పందం కుదుర్చుకుంది. ఇదే తరహా ఒప్పందం ఇండోనేషియాతో కూడా తుది దశలో ఉందని భారత - మిగతా 2లో



# సంపాదకీయం

## సనాతన ధర్మం, చరిత్ర ఒకటేనా

బండి నారాయణస్వామి వంటి రచయితలు సనాతన ధర్మాన్ని ఒక భౌతిక ‘చరిత్ర’గా కుదించి (‘మతాలన్నీ సనాతనం వైపే!’-- 24--5--2026) చూసే ప్రయత్నం చేస్తున్నారు. తాత్త్వికంగా చరిత్ర అనేది స్థల కాల బద్ధమైనది. కానీ ‘సనాతనం’ అంటేనే స్థల కాలాలకు అతీతమైన అనంత సత్యం. బుద్ధుడి కాలం నుంచి ఆధునిక తాత్త్వికుల వరకు ఎవరూ సనాతన ధర్మాన్ని భౌతిక చరిత్రతో లంకె పెట్టలేదు. నేటి ‘చరిత్ర’ అనే భావన ఐరోపా వలసవాద దృక్పథం నుంచి దిగుమతి అయినది. ఏసుక్రీస్తును చారిత్రక పురుషుడిగా రెండు వేల ఏళ్ల క్రితం నాటి పాలస్తీనాకు పరిమితం చేయడం సాధ్యం. కానీ, మన పురాణపురుషుడైన శ్రీరాముడి స్థల కాలాలను ఇటువంటి కొలమానాలతో నిరూపించడం అసాధ్యం. పాశ్చాత్య చారిత్రక కాలం అనేది ఒక బాణంలా సరళరేఖలో ముందుకు సాగుతుంది. భారతీయ భావనలో కాలం చక్రాకృతిలో భ్రమిస్తుంది. కాలం అనంతం కావడం వల్ల, పురాణాల ప్రకారం రాముడు ఒక్కసారే అవతరించడు. ఆ దివ్యలీల విశ్వ కాలచక్రంలో నిరంతరం పునరావృతమవుతూనే ఉంటుంది. అబ్రహామిక్ మతాలలా సనాతన ధర్మానికి ఏకైక పుణ్యస్థలం, ఒకే గ్రంథం, అంతిమ ప్రవక్త గానీ లేరు. సనాతన ధర్మం ఏ ఇతర జీవన విధానాన్ని నేలమట్టం చేయాలని చూడదు, బానిసగా మార్చుకోదు. దీనికి వెలుపల ‘ఇతరములు’ (ఒష్ట్రవ క్ష్ట్రవతీం) అని విడిగా గుర్తించడమే తాత్త్వికంగా కుదరదు. నారాయణస్వామి ఒకవైపు వర్ణ ధర్మాన్ని తిరస్కరిస్తారు. మరొకవైపు జాతి, డీఎన్‌ఏ, రక్తం వంటి పదాల్ని రేసిస్ట్ పదాల్ని వాడతారు. కుల వివక్ష కన్నా రేసిజం గొప్పదా? కుల నిర్మూలనవాదులు అని చెప్పుకున్న వారిలో సాధారణంగా కనబడే ముస్లిం వ్యతిరేకత ఈయనలోనూ కనపడుతుంది. పాకిస్తాన్‌కు వచ్చిన ప్రమాదం అరబ్బులనో, టర్కీనో ఆశ్రయించటం వల్ల కాదు ముస్లిం జాతీయవాదం వల్ల వచ్చింది. అలాగే భారతదేశానికి వస్తున్న ప్రమాదం కూడా హిందూత్వ జాతీయవాదం వల్లనే. ఆ హిందూ మతం పూర్తిగా కొత్తది అదొక ప్రచ్ఛన్న క్రైస్తవం. అది సనాతన ధర్మం కాదు. అరబ్బులు పోర్చుగీసుల దాడులతోనే ఇస్లాం, క్రైస్తవాలు భారతదేశంలోకి ప్రవేశించాయి అనే వాదన పూర్తిగా హిందూత్వ ఫాసిజానికి దగ్గరగా ఉంది. మొట్టమొదట కేరళలో ఇస్లాం అరబ్బులతో వ్యాపార సంబంధాల వల్ల ప్రవక్త జీవించి ఉన్న ఏడవ శతాబ్దంలోనే ప్రవేశించింది. యుద్ధం ద్వారా కాదు. భారతదేశంలోకి క్రైస్తవ మతం క్రీస్తు శకం 1వ శతాబ్దంలోనే ప్రవేశించింది. ఏసుక్రీస్తు పన్నెండు మంది ముఖ్య శిష్యులలో ఒకరైన సెయింట్ థామస్ ద్వారా ఈ మతం భారత గడ్డ పైకి వచ్చింది. అప్పటికి యూరప్‌లోకి క్రైస్తవం వెళ్ళనే లేదు. ప్రతిదాన్ని ఘర్షణాత్మకంగా చూడడం హిందూత్వ ఫాసిజంలో భాగం. బ్రిటిష్ కాలానికి చెందిన శృంగేరి శారదా పీఠాధిపతులు జగద్గురు శ్రీ చంద్రశేఖర భారతీ స్వామి వారి ప్రకారం సనాతన ధర్మం రెండు విధాలు: ఒకటి-- ‘సామాన్యం’, రెండు-- ‘విశేషం’. సామాన్య దృక్పథంలో చూస్తే క్రైస్తవం, ఇస్లాం కూడా సనాతన ధర్మ స్వరూపాలే; వాటి ఆచారాలు, గ్రంథాలు వాటి విశేష గుణాలు మాత్రమే. అందుకే, వైదిక ధర్మంలోకి ఘర్ వాపసీ కోరుకొన్న ఒక క్రైస్తవుడిని స్వామి నిరాకరిస్తూ, భగవదిచ్ఛ ప్రకారమే ఆ మతంలో జన్మించావు కాబట్టి, అందులోనే సచ్ఛీలుడిగా జీవించమని ప్రబోధించారు. దీన్ని విస్మరించి, హిందూమతం అన్నిటికన్నా ప్రాచీనమైనది, మిగిలినవి కురుచ మతాలు అని చరిత్ర ఆధారంగా నిరూపించాలనుకోవడం ప్రచ్ఛన్న క్రైస్తవమే. ‘స్వదేశీ--విదేశీ మతాలు’ అనే పదాలు వాడటంలోనే అసలు సనాతనతత్వం మిస్ అయింది. మతాల స్థల కాలాలు, కొత్త పాతలు వెతకడం సనాతనం కాదు. అలాగే ఒక మతం కన్నా మరొక మతం గొప్పది తక్కువది అనే భావాన్ని రామకృష్ణ పరమహంస తిరస్కరించారు. అన్నీ ఒకే సత్యం యొక్క బహుళ వ్యక్తీకరణలు అనే ఆయన భావించారు. అసలు ‘మతం’, ‘హిందూ’ అనే కాన్సెప్ట్‌లే బ్రిటిష్ కాలంలో వచ్చిన ఆధునిక భావనలు. అవి సనాతనాలు కావు. నారాయణస్వామి చారిత్రక ప్రమాణం ప్రకారం చూసినా, హిందూ మతం ప్రాచీనం అని కానీ, పూర్తి స్వదేశీ అని కానీ గొప్పలు చెప్పడం కుదరదు. అందరూ వలస వచ్చినవారే. స్వామి నేటి హిందూవాదుల చరిత్రను ప్రమాణంగా తీసుకొంటున్నారు అనుకుంటా. అలాగే భారతీయ ఇస్లాం, క్రైస్తవాలు స్థానిక లక్షణాలు సంతరించుకున్నాయి. ఉదాహరణ దర్గా సంస్కృతి. సూఫీయిజం, షిరిడి సాయిబాబా పూజా విధానం, అలాగే వేంకటేశ్వర స్వామి--బీబీ నాంచారి కథ... ఒక ఉమ్మడి సంస్కృతిని మనకి పరిచయం చేస్తాయి. సూఫీయిజం భారతీయ సర్వాంతర్యామి దృక్పథానికి అద్వైతానికి చాలా దగ్గర. వీటిగురించి స్వామి అసలు మాట్లాడరు. ఈ చారిత్రక ఏకీకరణ దృక్పథం సావర్కర్ ప్రతిపాదించిన రాజకీయ హిందుత్వ సిద్ధాంతానికి సమీపంగా ఉంటుంది. అందుకే ఆ కాలంలోనే సనాతన ధర్మ సంరక్షకులైన స్వామి కరపాత్రి... సావర్కర్ రాజకీయాన్ని, సావిత్రీదేవి (మాక్సిమిలియాని పోర్టాస్) వంటి వారు హిట్లర్‌ను విష్ణుమూర్తి అవతారంగా పోల్చడాన్ని సనాతన బాహ్యమైనవిగా తిరస్కరించారు. సావర్కర్ చెప్పిన భారత్‌ను పుణ్యభూమిగా చేసుకున్నవాళ్లే స్వదేశీయులు అనే సిద్ధాంతాన్ని, ఇది విదేశాలలో పౌరులైన హిందువులకు కూడా ముప్పు అని కరపాత్రి తిరస్కరించారు. అందుకే విదేశాలలో భారతీయులు ఎదుర్కొంటున్న మత వివక్షని ఇప్పుడు మనం చూస్తున్నాం. సావర్కర్ సైతం తన ‘హిందుత్వ’ గ్రంథంలో సనాతన ధర్మం వేరని, తాను ప్రతిపాదిస్తున్న రాజకీయ హిందుత్వ వేరని స్పష్టం చేశారు. సనాతన ధర్మం బహుళత్వాన్ని అంగీకరిస్తుంది; కానీ హిందుత్వ జాతీయ ఏకీకరణను కోరుకుంటుంది. సావర్కర్ సిద్ధాంతం ప్రకారం... ఆర్యులు వచ్చాక తమ పూర్వపు విదేశీ స్మృతులను విస్మరించి హిందువులుగా మారారు. ముస్లింలు అలా చేయలేదు. ముస్లింలు ఇప్పటికీ తమ పుణ్యభూమి మక్కాని విస్మరించలేదు. ఇక్కడ ఆయన పవిత్రమైన ‘స్మృతి’ని కాకుండా, చారిత్రక ‘విస్మృతి’ని (ూఎఅవంఱు) మూస జాతీయతకు ఒక సాధనంగా కొనియాడారు. సావర్కర్ వైదిక సనాతన ధర్మానికి మూలస్తంభాలైన ‘శ్రుతి--స్మృతులను’ తన చారిత్రక భౌతికవాదంతో పడగొట్టాలని చూశారు. పాశ్చాత్య ఫాసిస్ట్ దృక్పథాన్ని ఆశ్రయించారు. కన్నడ రచయిత భైరప్ప కూడా తన జీవితాంతం చరిత్రను ప్రాతిపదికగా చేసుకోవడం వల్లే, ఆయన తాత్త్విక ప్రయాణం ‘ఆవరణ’ వంటి నిర్దిష్ట రాజకీయ కోణాల వద్ద ఆగిపోవాల్సి వచ్చింది. సంస్కృత సంప్రదాయంలో ‘విదేశీయ మతాలు’ అనే విభజన రేఖ లేదు. సంస్కృత గ్రంథాలలో ‘మ్లేచ్ఛ’ అనే పదాన్ని యవనులు, ముస్లింలకే కాక, దేశీయంగా ఉంటూ సంస్కృతేతర స్థానిక భాషలు మాట్లాడే ద్రావిడులను, ఆంధ్రులను సూచించడానికి కూడా వాడారు. పైగా వేదాన్ని అర్థం చేసుకోవడానికి మ్లేచ్ఛభాషల అధ్యయనం కూడా ఉపయోగకరం అని వేద మీమాంస శబర భాష్యంలో రాశారు. ఖగోళ శాస్త్రవేత్తలైన మ్లేచ్ఛ గ్రీకులు ఋషులవలె పూజనీయులు అని వరాహమిహిరుడు రాశాడు. క్రైస్తవ మిస్టిక్స్ జ్ఞానానికి అద్వైతానికి పోలికలు ఉన్నాయి అని కంచి పరమాచార్య అన్నారు. కాబట్టి ఒక సంస్కృతిని ‘విదేశీయులది’ పరాయిది అని నిరసించడం ఆధునిక వలసవాద దృక్పథం. బ్రిటిష్ పాలకులు తమ ప్రయోజనాల కోసం సృష్టించిన ‘హిందూ--ముస్లిం’ ద్విజాతి సిద్ధాంతాన్ని, పాశ్చాత్య ప్రొటెస్టెంట్ చారిత్రకవాదాన్ని నేడు బండి నారాయణస్వామి సనాతన ధర్మానికి అన్వయించడం హిందుత్వ ఫాసిజం మాత్రమే.

# ‘జెన్ జీ’.. చూస్తోంది జాగ్రత్త

మా పార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉందన్న నినాదానికి కాలం చెల్లింది. యువతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో జెన్ జీ, జెన్ ఆల్ఫా పదాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రముఖంగా ప్రస్తావించారు. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనభై సంవత్సరాలు అవుతున్నందున స్వాతంత్ర్య పోరాటంలో అప్పటి కాంగ్రెస్ నాయకుల పాత్ర, తెల్ల దొరల పాలనలో ఈ దేశ ప్రజలు అనుభవించిన కష్టాల గురించి నేటి తరానికి అవగాహన లేకుండా పోయింది. దేశానికి స్వాతంత్ర్యం ఆషామాషీగా రాలేదని, ఎంతో మంది ప్రాణత్యాగం చేశారనే విషయం కూడా నేటి తరం తెలుసుకోలేకపోతోంది. ..డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్ గాంధీ యువతను ఆకట్టుకోలేక పోతున్నారు. ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించకుండా కాలం చెల్లిన విధానాలు, వివాదాలతోనే ఆ పార్టీ ముందుకు వెళు తోంది. మోదీ అధికారంలోకి వచ్చి పన్నెండేళ్లు అవుతోంది. ప్రజల్లో ఆయన పట్ల కూడా కొంత విముఖత ఏర్పడటం మొదలైంది. ప్రతిపక్షం బలంగా లేనప్పుడు ప్రజలే ప్రతిపక్షం బాధ్యత తీసుకుంటారు. బొద్దింకల ఉద్యమమే ఇందుకు నిదర్శనం. అభిజిత్ అనే ఒక దళిత యువకుడు సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీకి ఫాలోవర్ల సంఖ్య భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలను మించిపోయింది. ..ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో ఇప్పుడు జవాబుదారీతనం లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసుకుంటున్నాయి. నేపాల్, బంగ్లాదేశ్‌లో ప్రజల్లో తిరుగుబాటుకు ప్రభుత్వాలలో జవాబుదారీతనం లోపించడమే ప్రధాన కారణంగా చెబుతున్నారు. దురదృష్టవశాత్తు మన దేశంలో కూడా రాజకీయ వ్యవస్థ మీదే కాదు - కార్యనిర్వాహక, న్యాయ వ్యవస్థ, మీడియా పట్ల కూడా ప్రజల్లో అసంతృప్తి ఉంది. ఈ నేపథ్యంలోనే బొద్దింకల పార్టీ పుట్టుకొచ్చింది. ..అభివృద్ధి మాత్రమే ఓట్లు తెచ్చి పెట్టదు. ప్రభుత్వం పట్ల ప్రజల్లో, ముఖ్యంగా యువతలో ఫీల్ గుడ్ భావన కల్పించాలి. అది రావాలంటే ఇటు ప్రభుత్వంలో, అటు పార్టీలో జవాబుదారీతనాన్ని నెలకొల్పాలి. రాష్ట్రంలో మూడో పార్టీకి చోటు లేదని భావించడానికి లేదు. జెన్ జీ--జెన్ ఆల్ఫా! ఇప్పుడు కొత్తగా బొద్దింకలు! ఈ పదాలు వినపడినప్పుడల్లా మన దేశంలోని ప్రధాన రాజకీయ పార్టీలు ఉలిక్కిపడుతున్నాయి. నిన్నటి తరం ఆలోచనలతో, పాత చింతకాయ పచ్చడి విధానాలతో నడుస్తున్న పార్టీలకు ఎన్నికలలో నవతరం నుంచి ప్రతిఘటన ఎదురవుతోంది. యువతరంలో ఆశలు--ఆకాంక్షలు పెరుగుతున్న సమయంలోనే నిరాశా నిస్పృహలు కూడా వారిని కమ్మేస్తున్నాయి. ఫలితంగానే జెన్ జీ--బొద్దింకలు వంటి నినాదాలు పుట్టుకొచ్చి సంప్రదాయ రాజకీయ పార్టీలను తుడిచిపెడుతున్నాయి. మా పార్టీకి సుదీర్ఘ చరిత్ర ఉందన్న నినాదానికి కాలం చెల్లింది. యవతరంతో కనెక్ట్ కాని పార్టీలు మెల్లగా తెరమరుగవుతున్నాయి. ఈ నేపథ్యంలోనే తాజాగా జరిగిన తెలుగుదేశం పార్టీ మహానాడులో జెన్ జీ, జెన్ ఆల్ఫా పదాలను ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రముఖంగా ప్రస్తావించారు. నవతరంతో పార్టీ అనుబంధాన్ని పటిష్ఠం చేసే ప్రయత్నం చేశారు. తమిళనాడు ఎన్నికల ఫలితాల నేపథ్యంలో చంద్రబాబు యువత ప్రాధాన్యాన్ని గుర్తించినట్టుంది. ప్రధాని నరేంద్ర మోదీ కూడా సామాజిక మాధ్యమాలలో యువతరం వెలిబుచ్చుతున్న అభిప్రాయాలను ఎప్పటికప్పుడు తెలుసుకొని తదనుగుణంగా వ్యూహాలు రూపొందించుకోవాలని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. నిన్నటి తరానికి చెందిన ఈ ఇరువురు నాయకులూ రేపటి తరం గురించి ఆలోచించడానికి కారణం లేకపోలేదు. ఈ క్రమంలో ముందుగా కాంగ్రెస్ పార్టీ గురించి తెలుసుకుందాం. స్వాతంత్ర్య సంగ్రామాన్ని ముందుండి నడిపించిన కాంగ్రెస్ పార్టీ... ఆ తర్వాత దేశాన్ని సుదీర్ఘ కాలం పరిపాలించింది. తొలి ప్రధాని జవహర్‌లాల్ నెహ్రూ నుంచి లాల్‌బహదూర్ శాస్త్రి, ఇందిరాగాంధీ, రాజీవ్ గాంధీ, పీవీ నరసింహారావు, మన్మోహన్‌సింగ్ కాంగ్రెస్ పార్టీ నుంచి ప్రధానమంత్రులుగా పనిచేశారు. స్వాతంత్ర్యం వచ్చి దాదాపు ఎనభై సంవత్సరాలు అవుతున్నందున స్వాతంత్ర్య పోరాటంలో అప్పటి కాంగ్రెస్ నాయకుల పాత్ర, తెల్ల దొరల పాలనలో ఈ దేశ ప్రజలు అనుభవించిన కష్టాల గురించి నేటి తరానికి అవగాహన లేకుండా పోయింది. దేశానికి స్వాతంత్ర్యం ఆషామాషీగా రాలేదని, ఎంతో మంది ప్రాణత్యాగం చేశారనే విషయం కూడా నేటి తరం తెలుసుకోలేకపోతోంది. ఫలితంగా ప్రజల్లో జాతీయ భావం మసకబారింది. ఈ కారణంగానే కాంగ్రెస్ పార్టీ కూడా నేటి తరానికి దూరమైంది. కాంగ్రెస్ నాయకుల పెడ ధోరణులు కూడా మరో ప్రధాన కారణం. నాయకులు అవినీతి రొచ్చులో మునిగితేలడం వల్ల ప్రజలకు కాంగ్రెస్ దూరమైంది. ఇందిరాగాంధీ, రాజీవ్‌గాంధీ బలిదానాల గురించి ఈ తరానికి పెద్దగా తెలియదు. పార్టీని ఎప్పటికప్పుడు యువతతో కనెక్ట్ చేసుకునే పనిని కాంగ్రెస్ నాయకులు కూడా చేయలేదు. విధానాలను, ఆలోచనలను సవరించుకొని నవీకరించుకోలేదు. అధికారాన్ని బాధ్యతగా కాకుండా సంపాదనకు మార్గంగా భావించడం వల్ల కాంగ్రెస్ పార్టీ నాయకుల పట్ల ప్రజలకు ముఖం మొత్తింది. ఫలితంగా నవ తరానికి ఆ పార్టీ దూరమైంది. విచిత్రమేమిటంటే, డెబ్బై అయిదేళ్లు పైబడిన ప్రధాని నరేంద్ర మోదీ ఈ దేశం యువతతో కనెక్ట్ అవుతుండగా... వయసులో చిన్నవాడైన రాహుల్‌గాంధీ యువతను ఆకట్టుకోలేకపోతున్నారు. ఈ పరిస్థితికి కారణాలను అన్వేషించకుండా కాలం చెల్లిన విధానాలు, వివాదాలతోనే ఆ పార్టీ ముందుకు వెళుతోంది. ఈ కారణంగానే ఉత్తర భారతంలో ఆ పార్టీ తన అస్తిత్వాన్ని దాదాపుగా కోల్పోయే పరిస్థితి ఏర్పడింది. ప్రజలకు మనం ఎందుకు దూరమయ్యామనే ఆత్మపరిశీలన చేసుకోకుండా... ఐదారు దశాబ్దాల క్రితం కమ్యూనిస్టుల నోటి వెంట వెలువడిన నినాదాలను, వారు అనుసరించిన విధానాలను కాంగ్రెస్ పార్టీ అందిపుచ్చుకుంది. తరం మారినప్పుడల్లా ప్రజల ఆకాంక్షలు, ఆలోచనలు మారుతుంటాయని గుర్తించలేకపోతోంది.

**-చైనాను చూసైనా...**

చైనాలో చోటుచేసుకున్న తియాన్మెన్ స్క్వేర్ ఉదంతాన్నే తీసుకుందాం. అక్కడి కమ్యూనిస్టు ప్రభుత్వం అమలు చేస్తున్న కఠిన ఆంక్షలకు వ్యతిరేకంగా యువత గొంతు వినిపించింది. నిరసనలు ఉద్యమ రూపం సంతరించుకున్నాయి. నాటి ఉద్యమాన్ని అక్కడి ప్రభుత్వం అణచివేసినప్పటికీ... ఆ తర్వాత తన విధానాలను సవరించుకుంది. అంతకు ముందు అమలు చేసిన కఠిన నిబంధనలను సడలించి అనేక వెసులుబాట్లను కల్పించింది. ఇప్పుడు చైనాలో పగటిపూట కమ్యూనిజం, రాత్రి పూట క్యాపిటలిజం అమల్లో ఉంటున్నాయి. సౌకర్యాలు, విలాసాల కోసం పాశ్చాత్య దేశాల వైపు చూసే అవసరం లేకుండా చేశారు. ఫలితంగానే ప్రపంచవ్యాప్తంగా కమ్యూనిజం అంతరించిపోయినా చైనాలో మాత్రం వర్ధిల్లుతోంది. గ్లోబలైజేషన్ ప్రభావం ప్రపంచ దేశాలను చుట్టుముడుతున్న వేళ మన దేశంలో కాంగ్రెస్ పార్టీ సోషలిజం, సెక్యులరిజం వంటి విధానాలను సవరించుకోకుండా పాత విధానాలనే పట్టుకువేలాడింది. ప్రపంచీకరణ ప్రభావం మన దేశంలో గ్రామాలకు కూడా విస్తరించిన వాస్తవాన్ని విస్మరించింది. సెక్యులరిజం కూడా శ్రుతి మించుతోందని ప్రజలు భావిస్తున్న విషయాన్ని కాంగ్రెస్ నాయకులు గుర్తించలేదు. ఈ కారణంగానే ప్రధాని మోదీ తిరుగులేని నేతగా ఎదిగారు.

**-కాక్రోచ్’ కలకలం**

మోదీ అధికారంలోకి వచ్చి పన్నెండేళ్లు అవుతోంది. ప్రజల్లో ఆయన పట్ల కూడా కొంత విముఖత ఏర్పడటం మొదలైంది. ప్రతిపక్షం బలంగా లేనప్పుడు ప్రజలే ప్రతిపక్షం బాధ్యత తీసుకుంటారు. బొద్దింకల ఉద్యమమే ఇందుకు నిదర్శనం. అభిజిత్ అనే ఒక దళిత యువకుడు సోషల్ మీడియా వేదికగా ప్రారంభించిన కాక్రోచ్ జనతా పార్టీకి ఫాలోవర్ల సంఖ్య భారతీయ జనతా పార్టీ, కాంగ్రెస్ పార్టీలను మించిపోయింది. ఇదంతా రోజుల వ్యవధిలోనే జరగడంతో కేంద్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. కాక్రోచ్ జనతా పార్టీకి ఫాలోవర్లు అమాంతం పెరగడం వెనుక ఏదో ఉందని భావించిన కేంద్ర ప్రభుత్వం సోషల్ మీడియాలో ఆ పార్టీ ఖాతాలను స్తంభింపజేసింది. అంతటితో పనైపోయిందని ప్రధాని మోదీ రిలాక్స్ అవలేదు. నవతరం ఏం కోరుకుంటున్నదో తెలుసుకొనే పనిలో ప్రస్తుతం ఆయన ఉన్నారు. యువతరంలో అసంతృప్తి నెలకొంటే ఏం జరుగుతుందో ప్రధానికి బాగా తెలుసు. తమిళనాడు ఎన్నికల్లో ఏం జరిగిందో చూశాం కదా! ఆ రాష్ట్రంలో ద్రవిడ పార్టీలకు తప్ప మరో పార్టీకి చోటు ఉండదన్న భావన ఉండేది. ఈ కారణంగానే డీఎంకే, అన్నాడీఎంకే పార్టీలు రిలాక్స్ అయ్యాయి. ద్రవిడ వాదానికి నేటి తరం దూరమైందని-- పెరియార్, అన్నాదురైల ప్రభావం నవ తరంపై లేదని గుర్తించలేకపోయారు. ఫలితంగానే సినీ నటుడు జోసెఫ్ విజయ్







నాయకత్వంలో టీవీకే పార్టీ ఆవిర్భవించింది. తమిళ యువత మూకుమ్మడిగా విజయ్ వైపు ఆకర్షితులయ్యారు. దశాబ్దాల చరిత్ర ఉన్న డీఎంకే, అన్నాడీఎంకేలు ఓటమిపాలయ్యాయి. ఆ పార్టీలకు ఇప్పుడు మిగిలింది చరిత్ర మాత్రమే. డీఎంకే పార్టీ వారసుడిగా యువకుడైన ఉదయనిధి స్టాలిన్ తెర మీదకు వచ్చారు. అయినా యువతరం జోసెఫ్ విజయ్ వైపే మొగ్గు చూపారు. అంటే యువతరం కేవలం యువ నాయకత్వాన్నే కాదు-- కొత్తదనం ఏదో కోరుకుంటోందని భావించాలి. యువ నాయకత్వం ఉంటే చాలు అని అనుకోవడానికి లేదు. అలా అయితే రాహుల్ గాంధీ ముందు ప్రధాని మోదీ నిలబడలేరుకదా! నవతరం మనసులో ఏముందో గుర్తించి అందుకు అనుగుణంగా పార్టీ విధానాలు, నినాదాలను సవరించుకుంటేనే భవిష్యత్తు ఉంటుందని తమిళనాడు ఫలితం రుజువు చేస్తోంది. ఎన్నికలు రాగానే సరికొత్త సంక్షేమ పథకాలను ప్రకటించి ఓటర్లకు డబ్బు పంచితే చాలన్న భావన ఇప్పటివరకు ఉండింది. తమిళనాడు ఎన్నికలు ఇందులో నిజం లేదని రుజువుచేశాయి. టీవీకే పార్టీ అధ్యక్షుడు విజయ్ డబ్బు పంచలేదు. అయినా యువతరం మద్దతుతో అధికారంలోకి వచ్చారు. విజయ్ కూడా ద్రవిడ పార్టీలతో పోటీపడి సంక్షేమ పథకాలు ప్రకటించారు కానీ ప్రజలు వాటి గురించి పట్టించుకోలేదు. నిజానికి నేటి తరానికి చెందిన యువత కేవలం సంక్షేమ పథకాలను మాత్రమే కోరుకోవడం లేదు. ప్రభుత్వంలో జవాబుదారీతనం కోరుకుంటున్నారు. ఢిల్లీ నుంచి గల్లీ దాకా వివిధ స్థాయిల్లో జవాబుదారీతనం ఇప్పుడు లోపించింది. అధికార దుర్వినియోగం పెచ్చరిల్లింది. ప్రభుత్వాలలో ఏ స్థాయిలో కూడా జవాబుదారీతనం కనిపించడం లేదు. ప్రభుత్వ కార్యాలయాల్లో ఏ ఒక్క ఫైలు కూడా దానంతట అది కదిలే పరిస్థితి లేదు. లంచం ఇవ్వనిదే కాగితం కదలని పరిస్థితి. ఈ కారణంగానే ఈ దేశ యువతలో ఆశలు, ఆకాంక్షలతో పాటు నిరాశా నిస్పృహలు చోటుచేసుకుంటున్నాయి. అందుకే అవకాశం రాగానే మార్పును ఆహ్వానిస్తున్నారు. దురదృష్టవశాత్తు ఏ ఒక్క రాజకీయ పార్టీ కూడా ఈ మౌలిక సమస్యపై దృష్టి పెట్టడం లేదు. వ్యవస్థలలో జవాబుదారీతనం తీసుకురావడానికి ప్రయత్నించడం లేదు. పథకాలు ప్రకటించి ప్రజలకు డబ్బులు పంచితే చాలు అన్న మూస విధానాన్ని పట్టుకొని వేలాడుతున్నాయి ఫలితంగా జెన్ జీ ఉద్యమాలు, బొద్దింకల పార్టీలు పుట్టుకొస్తున్నాయి.

**-నేతలూ... వైఖరులూ...**

కేంద్ర మంత్రులలో అవినీతిని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చాలా మటుకు అదుపు చేయగలిగారు. వ్యవస్థల్లో జవాబుదారీతనం కూడా తీసుకురాగలిగితే ఆయన నాయకత్వాన్ని దేశ ప్రజలు మరింత కాలం ఆదరిస్తారు. ప్రాంతీయ పార్టీలు బలంగా ఉన్న రాష్ట్రాలలో కూడా దురదృష్టవశాత్తు జవాబుదారీతనం లోపించింది. అవినీతి పెచ్చరిల్లుతోంది. ప్రారంభంలో ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పనిచేసిన ప్రాంతీయ పార్టీలు క్రమంగా ఆశయాలకు దూరమవుతున్నాయి. 1983లో తెలుగుదేశం పార్టీ అధికారంలో వచ్చినప్పటికీ నేటి పరిస్థితులకూ పోలికే లేదు. 2014లో కేసీఆర్ అధికారంలోకి వచ్చినప్పటితో పోల్చితే 2023 నాటికి పరిస్థితులు మారిపోయాయి. వ్యవస్థల పతనం, ప్రజల ఆలోచనా విధానం మారడం కూడా ఇందుకు కారణం కావచ్చు. తమిళనాడులో ద్రవిడ పార్టీలది కూడా ఇదే పరిస్థితి. ‘ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి తెలిస్తే’... అన్న ఊహే కేంద్ర మంత్రులను, బీజేపీ నాయకులను వణికిస్తోంది. కేంద్రంలోనే కాకుండా అనేక రాష్ట్రాలలో అధికారంలో ఉన్న జాతీయ పార్టీ బీజేపీపైనే ప్రధాని మోదీకి ఇంత పట్టు ఉన్నప్పుడు ఒకే ఒక రాష్ట్రంలో మనుగడ సాగించే ప్రాంతీయ పార్టీల అధిపతులకు ఎందుకంత పట్టు ఉండటం లేదన్న ప్రశ్న సహజంగానే ఉత్పన్నం అవుతోంది. తెలుగుదేశం పార్టీని స్థాపించిన ఎన్టీఆర్ రాజకీయాలకు కొత్త. పార్టీ పెట్టిన తొమ్మిది నెలలకే అధికారంలోకి వచ్చి ఆయన సృష్టించిన రికార్డు ఇప్పటికీ చెక్కు చెదరలేదు. వచ్చినప్పటికీ ప్రభుత్వంలోని వివిధ స్థాయిల్లో జవాబుదారీతనాన్ని నెలకొల్పలేక పోతున్నారు. వ్యవస్థల పతనం ఇందుకు ప్రతిబంధకం అయితే అయి ఉండవచ్చునుగానీ ఆ విషయం అర్థం చేసుకొనే ఓపిక నేటి తరానికి లేదు.

# ఓటు చోరీ కుట్రలపై కాంగ్రెస్ సమరశంఖం






**-ఓటు హక్కుపై దాడి చేస్తే ఊరుకోం..**

**-ప్రతి బూత్‌లో అప్రమత్తంగా ఉండాలని పిలుపు..**

**-ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ నాయకులదే కీలక పాత్ర..**

**-ఆదిలాబాద్‌లో కాంగ్రెస్ శ్రేణుల్లో కొత్త జోష్..**

హంసకలం వార్త మే 31 మంచిర్యాల జిల్లా ప్రతినిధి

దేశ ప్రజాస్వామ్యానికి ప్రాణాధారమైన ఓటు హక్కును హరించే కుట్రలు జరుగుతున్నాయని, అలాంటి ప్రయత్నాలను కాంగ్రెస్ పార్టీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించబోదని పెద్దపల్లి పార్లమెంట్ సభ్యుడు గడ్డం వంశీకృష్ణ స్పష్టం చేశారు. ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన కాంగ్రెస్ బూత్ స్థాయి నాయకుల సమావేశంలో పాల్గొన్న ఆయన కేంద్ర ప్రభుత్వ విధానాలపై తీవ్ర స్థాయిలో విరుచుకుపడ్డారు. ఆదిలాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ ఇంచార్జ్‌గా జిల్లా కేంద్రానికి చేరుకున్న గడ్డం వంశీకృష్ణకు పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. అనంతరం నిర్వహించిన సమావేశంలో పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేస్తూ ప్రజాస్వామ్య పరిరక్షణలో బూత్ స్థాయి నాయకుల పాత్ర అత్యంత కీలకమని పేర్కొన్నారు. దేశవ్యాప్తంగా ఓటర్ల జాబితాల ప్రత్యేక పరిశీలన పేరుతో లక్షలాది మంది ఓటర్ల పేర్లను తొలగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించిన ఆయన, ఇది ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. తమిళనాడు, పశ్చిమ బెంగాల్ వంటి రాష్ట్రాల్లో కూడా ఇలాంటి పరిణామాలు చోటుచేసుకున్నాయని గుర్తు చేశారు. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును కాపాడుకోవడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రతి బూత్‌లో కాంగ్రెస్ నాయకులు అప్రమత్తంగా ఉండాలని పిలుపునిచ్చారు. లోక్‌సభ ప్రతిపక్ష నాయకుడు రాహుల్ గాంధీ గతంలోనే ఓటు చోరీ ప్రమాదాన్ని దేశ దృష్టికి తీసుకువచ్చారని, ప్రస్తుతం ఆ హెచ్చరికలు నిజమవుతున్నాయని పేర్కొన్నారు. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన ఓటు హక్కును బలహీనపరిచే ప్రతి ప్రయత్నాన్ని ప్రజలే తిప్పికొట్టాలని అన్నారు. విద్యారంగంపై స్పందించిన గడ్డం వంశీకృష్ణ, జాతీయ అర్హత ప్రవేశ పరీక్ష నిర్వహణలో చోటుచేసుకుంటున్న అవకతవకలపై ఆందోళన వ్యక్తం చేశారు. ప్రశ్నపత్రాల లీకేజీల కారణంగా లక్షలాది మంది విద్యార్థుల భవిష్యత్తు అనిశ్చితిలో పడుతోందని అన్నారు. కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ బాధ్యత వహించాలని దేశవ్యాప్తంగా విద్యార్థి సంఘాలు, ప్రజాసంఘాలు డిమాండ్ చేస్తున్నా కేంద్ర ప్రభుత్వం మౌనంగా ఉండటం దురదృష్టకరమన్నారు. తెలంగాణ రాజకీయ పరిస్థితులపై మాట్లాడుతూ భారత రాష్ట్ర సమితి, భారతీయ జనతా పార్టీలు ప్రజలను భావోద్వేగాలతో మభ్యపెట్టే రాజకీయాలకు పాల్పడుతున్నాయని విమర్శించారు. యువతను రెచ్చగొట్టి కేసుల్లో ఇరికించడం కాకుండా వారి విద్య, ఉపాధి, భవిష్యత్తుపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉందన్నారు. సమావేశంలో పార్టీ బలోపేతం, సభ్యత్వ నమోదు కార్యక్రమాలు, బూత్ కమిటీల ఏర్పాటు, ప్రజా సమస్యలపై పోరాట కార్యాచరణ, రాబోయే ఎన్నికల వ్యూహాలపై విస్తృతంగా చర్చించారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్‌ను మరింత బలోపేతం చేయాలని నాయకులు, కార్యకర్తలకు గడ్డం వంశీకృష్ణ పిలుపునిచ్చారు. సమావేశానికి కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు..

# ప్రజల కష్టాల్లో నేనున్నా ఎమ్మెల్యే హామీ





**-ఈదురుగాలుల బీభత్సం..ఇంటి రేకులు ఎగిరిపాటు!..**

**-ఘటనాస్థలానికి చేరుకున్న గడ్డం వినోద్ వెంకటస్వామి..**

**-బాధిత కుటుంబానికి అండగా నిలుస్తామని భరోసా..**

**-తక్షణ సహాయానికి అధికారులకు ఆదేశాలు..**

హంసకలం వార్త మే 31మంచిర్యాల జిల్లా ప్రతినిధి

లింగంపల్లి మహేష్

బెల్లంపల్లి మున్సిపాలిటీ పరిధిలో ఇటీవల కురిసిన భారీ వర్షాలు, ఈదురుగాలుల ప్రభావంతో ఓ ఇంటి పైభాగంలో అమర్చిన రేకులు ఒక్కసారిగా గాలికి ఎగిరిపడి కిందపడిన ఘటన స్థానికంగా ఆందోళనకు గురిచేసింది. ఘటన జరిగిన వెంటనే విషయం తెలుసుకున్న బెల్లంపల్లి ఎమ్మెల్యే గడ్డం వినోద్ వెంకటస్వామి బాధితుల నివాసానికి చేరుకుని పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. ఘటనలో ఎలాంటి ప్రాణనష్టం జరగకపోవడం ఊరటనిచ్చే విషయమని ఎమ్మెల్యే పేర్కొన్నారు. బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన ప్రజలకు ప్రభుత్వం అండగా నిలుస్తుందని భరోసా ఇచ్చారు. అనంతరం సంబంధిత అధికారులతో ఎమ్మెల్యే మాట్లాడి, బాధిత కుటుంబానికి తక్షణ సహాయం అందించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రజల కష్టసుఖాల్లో ఎల్లప్పుడూ తమ సహకారం ఉంటుందని, ఎలాంటి ఆపద వచ్చినా ప్రజల పక్షాన నిలబడతామని గడ్డం వినోద్ వెంకటస్వామి స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దావ స్వాతి రమేష్ బాబు, స్థానిక వార్డు కౌన్సిలర్, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు, అధికారులు పాల్గొన్నారు. ఘటన నేపథ్యంలో బాధిత కుటుంబానికి ధైర్యం చెప్పడంతో పాటు అవసరమైన సహాయ చర్యలను వేగవంతం చేయాలని స్థానిక ప్రజలు కోరారు.

# దేవుళ్లు, మతాల పేరిట రాజకీయం చేయం

**-అన్ని మతాల ఆత్మగౌరవ పరిరక్షణే ప్రజా ప్రభుత్వ విధి..**

**-రూ.3.30 కోట్లతో కూసుమంచి గణపేశ్వరాలయ పునర్నిర్మాణ శంకుస్థాపన కార్యక్రమంలో మంత్రి పొంగులేటి ..**

**-పుష్కరాల నాటికి భద్రాద్రి పనులు పూర్తి అవుతాయని వెల్లడి ..**

( మే - 31- హంస కలంవార్త )


కూసుమంచి : దేవుళ్లు, మతాల పేరిట రాజకీయం చేయడం తమ ప్రభుత్వ విధానం కాదని, అన్ని మతాలను సమానంగా గౌరవిస్తూ మత సామరస్యానికి ప్రతీకగా నిలవడమే ప్రజా ప్రభుత్వ లక్ష్యమని తెలంగాణ రెవెన్యూ, గృహ నిర్మాణం, సమాచార శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. కూసుమంచి మండల కేంద్రంలోని చారిత్రాత్మక శ్రీ రామలింగేశ్వర స్వామి దేవాలయం (గణపేశ్వరాలయం) పునర్నిర్మాణ, అభివృద్ధి పనులకు రూ.3.30 కోట్ల వ్యయంతో ఆదివారం ఆయన శంకుస్థాపన చేశారు. ఖమ్మం ఎంపీ రామసహాయం రఘురాంరెడ్డి, జిల్లా కలెక్టర్ దివాకర టి.ఎస్.లతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి మాట్లాడుతూ.. ప్రతి మతం ఆత్మగౌరవాన్ని, సంస్కృతిని కాపాడుతామని.. దేవాలయాలతో పాటు చర్చిలు, మసీదుల అభివృద్ధికి సమాన ప్రాధాన్యం ఇస్తున్నట్లు వివరించారు. ఇటీవల సమ్మక్క-సారలమ్మ జాతరను అత్యంత వైభవంగా నిర్వహించడమే ఇందుకు నిదర్శనమన్నారు. గత ప్రభుత్వం భద్రాచలం ఆలయ అభివృద్ధికి వంద కోట్లు ఇస్తామని ప్రకటించి.. ఒక్క రూపాయి కూడా ఇవ్వకుండా మోసం చేసిందని మంత్రి విమర్శించారు. ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి భద్రాద్రి ఆలయ సమగ్ర రూపురేఖలు మార్చేందుకు రూ.350 కోట్లు కేటాయించి పనులకు శంకుస్థాపన చేశారని, వారం పది రోజుల్లోనే పనులు ప్రారంభమవుతాయని స్పష్టం చేశారు. ఆలయ పరిసరాల్లో భూసేకరణ కోసమే ఇప్పటికే రూ.68 కోట్లు ఖర్చు చేశామన్నారు. రాబోయే గోదావరి పుష్కరాల నాటికి భద్రాచలం పనులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి పేర్కొన్నారు. బాసర నుంచి



భద్రాచలం వరకు గోదావరి తీరంలోని పుణ్యక్షేత్రాల అభివృద్ధికి ప్రభుత్వం రూ.1,000 కోట్లు మంజూరు చేసిందని, అందులో భాగంగానే గణపేశ్వరాలయ పనులను చేపట్టామన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఇరిగేషన్ అభివృద్ధి సంస్థ చైర్మన్ మువ్వా విజయ్ బాబు, దేవాదాయ శాఖ అధికారులు, ఆర్డీఓ శ్రీనివాస్, తహసీల్దార్ సైదులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అర్చకులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# సైబరాబాద్ లో వీకెండ్--స్పెషల్ డ్రంక్ డ్రైవ్ 293 మందిపై కేసులు





( మే - 31- హంస కలంవార్త )

సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలో వీకెండ్ స్పెషల్ డ్రంక్ అండ్ డ్రైవ్ లో భాగంగా సైబరాబాద్ ట్రాఫిక్ పోలీసులు విస్తృతంగా డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టారని సైబరాబాద్ ట్రాఫిక్-జాయింట్ ట్రాఫిక్ I, జి హన్మంతరావుతెలిపారు. ఈ డ్రైవ్‌లో భాగంగా 293 మందిని అదుపులోకి తీసుకొని కేసులు నమోదు చేశారు. 241 ద్విచక్ర వాహనదారులు,11 ఆటోలు,39 కార్లు, 02 హెవీ వాహనదారులపై కేసులు నమోదయ్యాయి. బ్లడ్ ఆల్కహాల్ కాన్సన్ట్రేషన్ (బిఎసి) ఆధారంగా కేసులను వర్గీకరిస్తే ---244 మంది 36 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 200 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,26 మంది 201 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 300 ఎం జీ/100 ఎంఎల్ మధ్య,23 మంది 301 ఎం జీ/100 ఎంఎల్ నుంచి 550 ఎం జీ/100 ఎంఎల్ మధ్య ఆల్కహాల్ సేవించి పట్టుబడ్డారు.వీరందరినీ చట్టపరంగా కోర్టుకు హాజరుపర్చనున్నట్లు సంబంధిత పోలీసులు అధికారులు తెలిపారు. మద్యం సేవించి డ్రైవింగ్ చేయటం తీవ్రమైన నేరమని సైబరాబాద్ పోలీసులు పునరుద్ఘాటించారు. మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి కారణమైతే, భారతీయ న్యాయ సంహిత --2023లోని సెక్షన్ 105 (కల్పబుల్ హోమిసైడ్ నాట్ అమౌంటింగ్ టు మర్డర్) కింద కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఈ నేరానికి గరిష్ట శిక్ష 10 ఏళ్ల జైలు, జరిమానా విధించే అవకాశం ఉంది. గత వారం (25.05.2026--30.05.2026) లో173 డ్రంక్ డ్రైవింగ్ కేసులను కోర్టులు పరిష్కరించాయి. 04 మందికి జరిమానా, జైలు శిక్ష,05 మందికి జరిమానా, సోషల్ సర్వీస్,164 మందికి జరిమానా విధించబడినట్లు ట్రాఫిక్ పోలీస్ అధికారులు తెలిపారు.

# ఏపీలో పాగా వేసిన టీడీపీ, జనసేన పార్టీలు తెలంగాణ పై ఫోకస్

**-జూన్ 2న హైదరాబాద్‌లో పవన్ కల్యాణ్ కీలక సమావేశం**

**-తమ తర్వాత టార్గెట్ తెలంగాణే అంటున్న టీడీపీ జనసేన పార్టీలు**

**-వచ్చే గ్రేటర్ ఎన్నికలతో పాటు అసెంబ్లీ ఎన్నికల కోసం కేడర్‌ను స్ట్రాంగ్ చేయాలనే ఆలోచన?**

**-వచ్చే గ్రేటర్ ఎన్నికలు, సార్వత్రిక ఎన్నికల్లోనూ కలిసి నడుస్తారా?**

( మే - 31- హంస కలంవార్త )



ఏపీలో పాగా వేసిన టీడీపీ, జనసేన పార్టీలు తమ తర్వాత టార్గెట్ తెలంగాణే అంటున్నాయి. గ్రామస్థాయి నుంచే టీడీపీని బలోపేతం చేసేదిశగా చర్యలు తీసు కుంటామని మహానాడు వేదికగా ఆ పార్టీ నేషనల్ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్ ప్రకటిస్తే జూన్ 2న హైదరాబాద్‌లో జనసేన అధినేత పవన్ మీటింగ్ పెట్టడం చర్చనీయాంశమవుతోంది. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడు తెలంగాణలో బలంగా ఉన్న టీడీపీ రాష్ట్ర విభజన తర్వాత కొంత బలహీనపడింది. అయినా సరే 2014 ఎన్నికల్లో టీడీపీ నుంచి 15 మంది ఎమ్మెల్యేలు గెలుపొందారు. అయితే వారంతా బీఆర్ఎస్‌లో చేరడంతో టీడీపీ పూర్తిగా బలహీనపడింది. 2018లో కాంగ్రెస్, వామపక్షాలతో జతకట్టి పోటీ చేసినా బీఆర్ఎస్ ముందు నిలబడలేకపోయింది. 2023 ఎన్నికలను పెద్దగా పట్టించుకోనేలేదు. అలాంటి పార్టీని ఇప్పుడు మళ్లీ పైకి లేపేందుకు తెలంగాణపై పసుపు జెండా ఎగరేసేందుకు అధిష్టానం ఉవ్విళ్లూరుతోంది. 2024లో ఏపీలో అధికారంలోకి వచ్చిన టీడీపీ మొన్నటి మహానాడు సాక్షిగా బిగ్ స్టేట్‌మెంట్ ఇచ్చింది. తెలంగాణలో పార్టీ బలోపేతంపై దృష్టిసారిస్తామన్నారు టీడీపీ జాతీయ వర్కింగ్ ప్రెసిడెంట్ లోకేష్. మళ్లీ గ్రామస్థాయి నుంచి పార్టీని బలోపేతం చేస్తామన్నారు. టీడీపీతో పొత్తుపెట్టుకుని ఏపీలో పవర్ షేరింగ్ అందుకున్న జనసేన కూడా తెలంగాణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. తెలంగాణ రాష్ట్ర ఆవిర్భావ దినోత్సవం జూన్ 2నే హైదరాబాద్‌లో తెలంగాణ జనసేన నేతలతో ఆ పార్టీ అధినేత పవన్ మీటింగ్ పెట్టడం ప్రాధాన్యత సంతరించుకుంది. తెలంగాణలో పార్టీ నిర్మాణం, జిల్లా స్థాయి కమిటీల బలోపేతం, యువతను ఆకర్షించే కార్యక్రమాలు, ప్రజా సమస్యలపై పార్టీ వైఖరి లాంటి అంశాలపై చర్చ జరిగే అవకాశం ఉంది. కొన్నేళ్లుగా జనసేన ఏపీ రాజకీయాలకే పరిమితం అయినా 2024లో ఏపీలో అధికారంలోకి వచ్చిన తర్వాత పరిస్థితులు మారాయ్. దీంతో తెలంగాణలో పార్టీకి కొత్త జీవం పోయాలని పవన్ నిర్ణయించుకున్నట్టు కనిపిస్తోంది. త్వరలో జరగబోయే గ్రేటర్ హైదరాబాద్ ఎన్నికలతో పాటు 2028 అసెంబ్లీ ఎన్నికల కోసం కేడర్‌ను స్ట్రాంగ్ చేయాలనే ఆలోచన జనసేన నాయకత్వంలో ఉన్నట్టు తెలుస్తోంది. మొత్తంగా టీడీపీ, జనసేన రెండు పార్టీలు తెలంగాణలో బలోపేతంపై ఫోకస్ పెట్టాయి. మరి ఏపీలోలాగా ఇక్కడ కూడా కలిసి వెళ్తారా? వచ్చే గ్రేటర్ ఎన్నికలు, ఆ తర్వాత సార్వత్రిక ఎన్నికల్లోనూ కలిసి నడుస్తారా? అన్నది చూడాలి.

# అసలు బ్రాహ్మణుడు ఎవరు?

-(జన్మ కాదు,జ్ఞానమే గీటురాయి)

( మే - 31- హంస కలంవార్త )



“జన్మనా జాయతే శూద్రః కర్మణా జాయతే ద్విజఃవేదపాఠం తు విప్రాణాం బ్రహ్మజ్ఞానంతు బ్రాహ్మణాః” ఈ శ్లోకం భారతీయ తత్వ చింతనకు పట్టుగొమ్మ.మనిషి విలువ పుట్టుకలో లేదు,పరిణతిలో ఉంది అని చాటే సూక్తి ఇది.అసలు బ్రాహ్మణత్వం అంటే కులమా? గుణమా? శాస్త్రాలు ఏం చెబుతున్నాయో లోతుగా చూద్దాం...ఈ శ్లోకం మానవ వికాసానికి నాలుగు మెట్లు చెబుతోంది.

**-జన్మణా జాయతే శూద్రః**

ప్రతి మనిషి పుట్టుకతో అజ్ఞాని, ఆకలి,నిద్ర,భయం తప్ప ఏమీ తెలియదు.అప్పుడు అందరూ సమానమే.ఎవరూ గొప్ప కాదు, తక్కువా కాదు.పుట్టుక ఒక్కటే మనిషి స్థాయిని నిర్ణయించదు.

**-కర్మణా జాయతే ద్విజః**

విద్య,సంస్కారం,సత్కర్మలతో మనిషి “రెండో జన్మ” ఎత్తుతాడు. అందుకే ఉపనయనాన్ని ద్విజత్వం అన్నారు.ఇది శరీరానికి సంబంధించిన జన్మ కాదు.అజ్ఞానం నుండి జ్ఞానంలోకి జరిగే ప్రయాణం. నేటి భాషలో స్కిల్ డెవలప్మెంట్.

**-వేదపాఠాత్ భవేత్ విప్రః**

శాస్త్రాలు చదివి,ధర్మ సూక్ష్మాలు గ్రహించినవాడు విప్రుడు.కానీ, కేవలం వల్లెవేస్తే సరిపోదు.తాను నేర్చిన జ్ఞానాన్ని సమాజ హితానికి వినియోగించాలి.జ్ఞానం దాచుకుంటే అది భారమే తప్ప ప్రయోజనం లేదు.

**-బ్రహ్మజ్ఞానాత్ తు బ్రాహ్మణః**

ఇదే అసలు పరీక్ష.“బ్రహ్మ” అంటే సర్వవ్యాపకమైన పరతత్వం. “సర్వం ఖల్విదం బ్రహ్మ” అని ఉపనిషత్.రాయి,రప్ప,శత్రువు, మిత్రుడు అందరిలోనూ ఒకే చైతన్యాన్ని చూడగలగడం. అహంకారం,ద్వేషం,అసూయ నశించి సమదృష్టి కలిగినవాడే నిజమైన బ్రాహ్మణుడు.శాస్త్రాల సాక్ష్యం ఏం చెబుతుందంటే... గుణమే ప్రధానం,జన్మ కాదు. వజ్రసూచికోపనిషత్తు “న జటాభిర్న గోత్రేణ న జన్మనా బ్రాహ్మణో భవతి । యస్మిన్ సత్యం తపో దానమహింసా చ స బ్రాహ్మణః ॥” జడలు,గోత్రం, పుట్టుక వల్ల బ్రాహ్మణుడు కాదు.సత్యం, తపస్సు,దానగుణం,అహింస ఉన్నవాడే బ్రాహ్మణుడు అని తేల్చి చెప్పింది. మహాభారతం-యక్ష ప్రశ్నలు యక్షుడు ధర్మరాజును “బ్రాహ్మణుడు ఎవరు?” అని అడుగుతాడు.ధర్మరాజు సమాధానం..“శూద్రే చైతద్భవేల్లక్ష్యం ద్విజే తచ్చ న విద్యతే । న వై శూద్రో భవేచ్ఛూద్రో బ్రాహ్మణో న చ బ్రాహ్మణః ॥” బ్రాహ్మణ లక్షణాలు శూద్రుడిలో ఉన్నా వాడు బ్రాహ్మణుడే.లక్షణాలు లేని బ్రాహ్మణుడు శూద్రుడితో సమానం.భగవద్గీత 18.42 మరియు 4.13 శ్రీకృష్ణుడు బ్రాహ్మణుడి లక్షణాలుగా శమము, దమము, తపస్సు,శౌచము, ఓర్పు,ఋజుత్వము, జ్ఞానము,విజ్ఞానము,ఆస్తిక్యము చెప్పాడు. “చాతుర్వర్ణ్యం మయా సృష్టం గుణకర్మవిభాగశః” అని వర్ణ వ్యవస్థ గుణకర్మల ఆధారంగానే కానీ పుట్టుకతో కాదు అని స్పష్టం చేశాడు.

**-చరిత్ర చెప్పిన సత్యం- జన్మ దాటిన ఋషులు**

శాస్త్రాలు చెప్పిన దానికి చరిత్రే సాక్ష్యం.వాల్మీకి బోయవాడుగా పుట్టి,తపస్సుతో ఆదికవి అయ్యాడు.రామాయణం రాశాడు. వ్యాసుడు జాలరి కన్య సత్యవతి పుత్రుడు.వేదాలను విభజించి వేదవ్యాసుడయ్యాడు.విశ్వామిత్రుడు క్షత్రియ రాజు.తపోబలంతో బ్రహ్మర్షి అయ్యాడు.గాయత్రీ మంత్ర ద్రష్ట అయ్యాడు.రైక్వుడు బండి కింద జీవించే శూద్రుడు.ఛాందోగ్య ఉపనిషత్తు ప్రకారం జానశ్రుతి మహారాజు ఆయన దగ్గరకు బ్రహ్మజ్ఞానం కోసం వెళ్లాడు.వీళ్ల జన్మలు వేరైనా,బ్రహ్మజ్ఞానంతో బ్రాహ్మణులయ్యారు. నేటి సమాజానికి అన్వయం-బ్రాహ్మణత్వం ఒక బాధ్యత “బ్రాహ్మణుడు” అనేది కులం కాదు,ఒక క్యారెక్టర్ సర్టిఫికెట్. దానికి కావలసిన అర్హతలు ఏమిటంటే... సత్యంతో మాటలో,చేతలో నిజాయితీ చూపడం. దమంతో కోపం,దురాశ, అసూయలను జయించడం.తపస్సుతో లక్ష్యసాధనకు క్రమశిక్షణతో కృషి చేయడం.జ్ఞానంతో “నేను ఎవరు?” అని ప్రశ్నించుకుని సత్యాన్వేషణ చేయడం.సమదృష్టితో గీత 5.18లో చెప్పినట్టు విద్వాంసుడు, పామరుడు,ఆవు,ఏనుగు,కుక్క అందరిలోనూ ఒకే ఆత్మను దర్శించడం.ఈ లక్షణాలు లేనివాడు బ్రాహ్మణ ఇంట్లో పుట్టినా వ్యర్థమే. ఈ లక్షణాలు ఉన్నవాడు ఏ ఇంట పుట్టినా వందనీయుడే.

**-ప్రమాదం ఎక్కడ?**

“వేదపాఠాత్” దగ్గరే ఆగిపోయి “బ్రహ్మజ్ఞానాత్” వైపు వెళ్లకపోతే అహంకారం వస్తుంది.“నాకు మాత్రమే తెలుసు” అనే భావన బ్రాహ్మణ లక్షణం కాదు.నిజమైన జ్ఞానం వినయాన్ని ఇస్తుంది. “అద్వేష్టా సర్వభూతానాం” ఎవరి పట్ల ద్వేషం లేనివాడే జ్ఞాని.చివరగా చెప్పొచ్చేది ఏమిటంటే... బ్రాహ్మణత్వం ఒక రిజర్వేషన్ కాదు, అది ఒక రెస్పాన్సిబిలిటీ. సమాజంలో అజ్ఞానపు చీకటిని పారద్రోలి జ్ఞానజ్యోతి వెలిగించడం, స్వార్థం లేకుండా అందరి మంచిని కోరడం దాని ధర్మం.కాబట్టి పుట్టుక మన చేతిలో లేదు.కానీ,పునీతుడు కావడం మన చేతిలో ఉంది.వంశం గొప్పది కాదు,వర్తన గొప్పది.పేరు గొప్పది కాదు,చేత గొప్పది. బ్రహ్మతత్వాన్ని ఎరిగి,ధర్మమార్గంలో నడిచే ప్రతి ఒక్కరూ అసలు సిసలు బ్రాహ్మణులే.ఇదే సనాతన ధర్మం మనకు ఇచ్చిన పరమ సందేశం.

# గండిపేట భూ కుంభకోణం.. బొల్లా బ్రహ్మనాయుడే కీలక వ్యక్తి: డీసీపీ శ్రీనివాస్

- గండిపేటలో రూ.1500 కోట్ల ప్రభుత్వ భూమి కబ్జాకు భారీ కుట్ర
- ఈ కుంభకోణంలో వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు పాత్రపై ఆధారాలు
- నకిలీ జీవోల తయారీకి రూ.4 కోట్లు చెల్లించినట్లు డీసీపీ శ్రీనివాస్ వెల్లడి
- ఈ కేసులో ఇప్పటివరకు ఐదుగురిని అరెస్ట్ చేసిన సైబరాబాద్ పోలీసులు
- మాజీ ఎమ్మెల్యే బ్రహ్మనాయుడు పరారీలో ఉన్నారని, గాలింపు కొనసాగుతోందని ప్రకటన

( మే - 31- హంస కలంవార్త )



హైదరాబాద్ శివారు గండిపేటలో వెలుగు చూసిన భారీ భూ కుంభకోణం కేసులో సంచలన విషయాలు బయటకు వస్తున్నాయి. సుమారు రూ.1500 కోట్ల విలువైన ప్రభుత్వ భూమిని నకిలీ పత్రాలతో కబ్జా చేసేందుకు జరిగిన ఈ కుట్రలో కీలక వ్యక్తి వైసీపీ మాజీ ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడేనని, అందుకు తమ వద్ద పక్కా ఆధారాలున్నాయని శేరిలింగంపల్లి డీసీపీ శ్రీనివాస్ స్పష్టం చేశారు. ఆదివారం నాడు విలేకరుల సమావేశంలో ఈ కేసుకు సంబంధించిన కీలక వివరాలను ఆయన వెల్లడించారు. డీసీపీ శ్రీనివాస్ వెల్లడించిన వివరాల ప్రకారం, ఈ కుంభకోణంలో బొల్లా బ్రహ్మనాయుడి పాత్ర అత్యంత కీలకంగా ఉంది. గండిపేటలోని వివాదాస్పద భూమిని క్రమబద్ధీకరించినట్లుగా నకిలీ ప్రభుత్వ ఉత్తర్వు (జీవో) సృష్టించేందుకు, ప్రధాన నిందితుడైన రాధాకృష్ణకు బ్రహ్మనాయుడు రూ.4 కోట్లు చెల్లించినట్లు విచారణలో తేలిందని డీసీపీ తెలిపారు. ఈ లావాదేవీలన్నీ నగదు రూపంలోనే జరిగాయని, ఈ సొమ్ము ఎక్కడికి వెళ్లిందనే కోణంలో దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఈ కుట్రలో భాగంగా నిందితులు అత్యంత పకడ్బందీగా నకిలీ పత్రాలు సృష్టించారని, కలెక్టర్, సీసీఎల్ఏ కార్యాలయాల నుంచి అనుమతులు వచ్చినట్లు నకిలీ దస్త్రాలు, ఐఏఎస్ అధికారుల ఫోర్జరీ సంతకాలతో ఉత్తర్వులు తయారు చేశారని వివరించారు. గండిపేట తహసీల్దార్ శ్రీనివాస్ రెడ్డి ఫిర్యాదు మేరకు ఈ కేసును నమోదు చేసినట్లు డీసీపీ తెలిపారు. వాట్సాప్ గ్రూపులలో నకిలీ జీవోలు సర్క్యులేట్ కావడంతో ఈ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఈ కేసులో ఇప్పటికే నిమ్మల రాజేష్ గౌడ్, నిమ్మల వేణుగోపాల్, నిమ్మల సాయికిరణ్‌లతో పాటు ప్రధాన నిందితుడు రాధాకృష్ణ, అతని డ్రైవర్ ప్రవీణ్ కుమార్‌ను అరెస్ట్ చేసినట్లు డీసీపీ వెల్లడించారు. ఇప్పటికే 9 కేసులలో నిందితుడిగా ఉన్న రాధాకృష్ణ నుంచి కందుకూరు, అంబర్‌పేట ప్రాంతాలకు చెందిన పలు భూముల పత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నామన్నారు. నిందితుల నుంచి నకిలీ జీవో కాపీలు, 13 నకిలీ స్టాంపులు, ల్యాప్‌టాప్‌లు, మొబైల్ ఫోన్లు, చెక్‌బుక్కులు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. గండిపేటలోని సర్వే నంబర్ 18లో ఉన్న సుమారు 10 ఎకరాల ప్రభుత్వ భూమిని కబ్జా చేసేందుకు ఈ కుట్ర పన్నారు. దీని విలువ మార్కెట్ అంచనాల ప్రకారం రూ.1000 నుంచి రూ.1500 కోట్ల వరకు ఉంటుంది. ఇప్పటికే ఈ భూమికి సంబంధించిన యాజమాన్య హక్కుల పిటిషన్‌ను 2025లోనే హైకోర్టు కొట్టివేసినప్పటికీ, ఇంత విలువైన భూమిపై ఒప్పందాలు చేసుకోవడం అనుమానాలకు తావిస్తోందని డీసీపీ పేర్కొన్నారు. ప్రస్తుతం ఈ కేసులో బొల్లా బ్రహ్మనాయుడు, బొల్లా రమేష్‌తో పాటు మరికొందరు పరారీలో ఉన్నారని, వారి కోసం ప్రత్యేక బృందాలతో గాలిస్తున్నామని డీసీపీ శ్రీనివాస్ వివరించారు. నగదు రూపంలో జరిగిన కోట్ల రూపాయల లావాదేవీలపైనా దృష్టి సారించి, దర్యాప్తు కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

# పంట అవశేషాల దహనాన్ని పూర్తిగా నివారించాలి -జిల్లా కలెక్టర్

( మే - 31- హంస కలంవార్త )

జిల్లాలో వరి కోతలు జరుగుతున్న నేపథ్యంలో రైతులు పంట అవశేషాలను. ముఖ్యంగా వరి కొయ్యలను బహిరంగంగా కాల్చి వేయకుండా జాగ్రత్తలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ సూచించారు.దపంట అవశేషాల దహనం వల్ల పర్యావరణ కాలుష్యం పెరగడంతో పాటు భూసారం తగ్గిపోతుందని, మానవ ఆరోగ్యంపై కూడా తీవ్ర ప్రతికూల ప్రభావం పడుతుందని తెలిపారు. పంట అవశేషాలను కాల్చడం వల్ల నేలలోని సేంద్రియ కార్బన్, ఉపయోగకర సూక్ష్మజీవులు. వానపాములు నశించి భూమి సారవంతత క్షీణిస్తుందని పేర్కొన్నారు. మంటలు అదుపు తప్పి సమీపంలోని ఆయిల్ పామ్ తోటలు, మామిడి తోటలు మరియు ఇతర పంట పొలాలకు వ్యాపించే ప్రమాదం ఉందని జిల్లా కలెక్టర్ తెలిపారు. దీనివల్ల రైతులు గణనీయమైన ఆర్థిక నష్టాన్ని చవిచూడాల్సి వస్తుందని పేర్కొన్నారు. ముఖ్యంగా వేసవి కాలంలో పొడి వాతావరణ పరిస్థితుల కారణంగా మంటలు వేగంగా వ్యాపించి సమీప వ్యవసాయ భూములను దెబ్బతీసే అవకాశం ఉన్నందున రైతులు అత్యంత అప్రమత్తంగా వ్యవహరించాలని సూచించారు. పంట అవశేషాల దహనం వల్ల సమీపంలోని విద్యుత్ ట్రాన్స్ ఫార్మర్లు, విద్యుత్ స్తంభాలు. విద్యుత్ సరఫరా తీగలు దెబ్బతినే ప్రమాదం ఉందని తెలిపారు. దీనివల్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగడంతో పాటు ప్రజలు, రైతులు మరియు విద్యుత్ సిబ్బందికి ప్రమాదాలు సంభవించే అవకాశం ఉందన్నారు. ప్రజా ఆస్తుల రక్షణ దృష్ట్యా రైతులు పంట అవశేషాలను కాల్చకుండా ప్రత్యామ్నాయ పద్ధతులను అనుసరించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన నిబంధనల ప్రకారం బహిరంగ ప్రదేశాల్లో వ్యర్థాలను. పంట అవశేషాలను తగలబెట్టడం నిషేధించబడిందని తెలిపారు. ఈ నిబంధనలను ఉల్లంఘించిన వారిపై పర్యావరణ పరిరక్షణ చట్టాల ప్రకారం రూ.5,000 నుండి రూ.25,000 వరకు జరిమానా విధించడంతో పాటు అవసరమైతే ఇతర చట్టపరమైన చర్యలు కూడా తీసుకునే అవకాశం ఉందని హెచ్చరించారు. రైతులు పంట అవశేషాలను పొలంలోనే కలియదున్ని, సింగిల్ సూపర్ ఫాస్ఫేట్ వంటి ఎరువులను వినియోగించడం ద్వారా వాటిని త్వరగా కుళ్లిపోయేలా చేసి సేంద్రియ ఎరువులుగా మార్చుకోవచ్చని సూచించారు. ఈ విధానం ద్వారా నేలలో పోషకాలు పెరిగి తదుపరి పంటలకు అధిక దిగుబడులు సాధించేందుకు దోహదపడుతుందని తెలిపారు. జిల్లాలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో



రైతులకు పంట అవశేషాల శాస్త్రీయ నిర్వహణపై విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, రైతులు వాటిని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పర్యావరణ పరిరక్షణ, భూసార పరిరక్షణ, ప్రజారోగ్య పరిరక్షణతో పాటు సమీపంలోని ఆయిల్పామ్, మామిడి తోటలు, ఇతర పంటలు మరియు విద్యుత్ మౌలిక వసతులను అగ్ని ప్రమాదాల నుంచి కాపాడేందుకు పంట అవశేషాల దహనానికి పూర్తిగా దూరంగా ఉండాలని జిల్లా కలెక్టర్ జిల్లా రైతాంగానికి విజ్ఞప్తి చేశారు.

# జనగణన హెచ్.ఎల్.ఓలోపాల సవరణ,ఇందిరమ్మ ఇండ్ల మహా గృహ ప్రవేశాలను అత్యంత ప్రాధాన్యత తో పూర్తి చేయాలి

-జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులకు దిశానిర్దేశం

( మే - 31- హంస కలంవార్త )

జనగణన హెచ్.ఎల్.ఓ డేటాలోని లోపాల సవరణతో పాటు, ఇందిరమ్మ ఇండ్ల మహా గృహప్రవేశాల కార్యక్రమాలను అత్యంత ప్రాధాన్యతతో నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ రాజర్షి షా అధికారులను ఆదేశించారు. ఆదివారం స్థానిక కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి సంబంధిత జిల్లా, మండల,మున్సిపల్ అధికారులకు ఆయన గూగుల్ మీట్ ద్వారా సుదీర్ఘ సమీక్షా సమావేశాన్ని నిర్వహించి పలు కీలక సూచనలు చేశారు.ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జనాభా గణనకు సంబంధించిన హెచ్.ఎల్.ఓ డేటాలో ఉన్న అన్ని రకాల అసంబద్ధతలను, లోపాలను క్షేత్రస్థాయి పరిశీలన ద్వారా తక్షణమే సరిచేయాలని స్పష్టం చేశారు.ఈ ప్రక్రియలో మాస్టర్ ట్రైనర్లు,సూపర్వైజర్లు, చార్జ్ అధికారులు,వార్డు అధికారులు పూర్తి సమన్వయంతో వ్యవహరించి తప్పుల్లేని డేటాను సిద్ధం చేయాలని ఆదేశించారు. అదేవిధంగా,ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ పనులను మరింత వేగవంతం చేసి,’ మహాగృహ ప్రవేశం’ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. గృహనిర్మాణ శాఖకు చెందిన డీఈలు, ఏఈలు నిరంతరం క్షేత్రస్థాయిలో పర్యటిస్తూ పనుల ప్రగతిని పర్యవేక్షించాలని, అధికారులు తమకు కేటాయించిన విధుల్లో ఎలాంటి అలసత్వాన్ని ప్రదర్శించకుండా వంద శాతం లక్ష్యాలను సాధించాలని హెచ్చరించారు.ఈ వర్చువల్ సమీక్షా సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ రాజేశ్వర్,జిల్లా రెవెన్యూ అధికారి స్రవంతి,జిల్లా పరిషత్ సీఈఓ రవి, జిల్లా పంచాయతీ అధికారి రమేష్, హౌసింగ్ పీడీ శంకర్,మున్సిపల్ కమిషనర్ జగదీశ్వర్ గౌడ్,



ఎంపీడీఓలు, చార్జ్ అధికారులు, కలెక్టరేట్ పర్యవేక్షకులు, సూపర్ వైజర్లు,మాస్టర్ ట్రైనర్లు ,ఇతర అధికారులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బటటస్ట్ అవైలబుల్ స్కీంకు నిధుల గ్రహణం

**-నాలుగేళ్లుగా అందని డబ్బులు**
**-బకాయిలు రూ.13 కోట్లు దాటడంతో చేతులెత్తేస్తున్న ప్రైవేట్ పాఠశాలలు**
**-ప్రశ్నార్థకంగా 1,500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల భవిష్యత్తు**
**-ఫీజులు చెల్లిస్తేనే సర్టిఫికెట్లు 'బెస్ట్ అవైలబుల్' విద్యార్థులపై ప్రైవేట్ యాజమాన్యాల ఒత్తిడి**
**-సర్కారు నిర్లక్ష్యంతో బడికి దూరమవుతున్న పేద విద్యార్థులు**

( మే - 31- హంస కలంవార్త )

ఎస్సీ, ఎస్టీ విద్యార్థులకు ప్రైవేట్ పాఠశాలల్లో ఉచిత విద్యను అందించేందుకు రూపొందించిన బెస్ట్ అవైలబుల్ స్కూల్స్ (బాస్) పథకం నాలుగేళ్లుగా నిధులు విడుదల కాక విద్యార్థులు చదువుకు దూరమయ్యే పరిస్థితి నెలకొంది. జూన్ 12న పాఠశాలలు పునఃప్రారంభం కానున్న నేపథ్యంలో ఈ పథకం కింద చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన బకాయిలు విడుదలకాకపోవడంతో వారి భవిష్యత్తు విద్యా ప్రస్థానంగా మారే అవకాశాలు ఉన్నాయి. గత విద్యాసంవత్సరం కొన్ని పాఠశాలలు ప్రభుత్వం బకాయిలు చెల్లిస్తేనే చదువులు చెబుతామని లేదంటే పిల్లలను ఇతర పాఠశాలల్లో చేర్పించుకోవాలని ప్రైవేట్ పాఠశాలలు విద్యార్థుల తల్లిదండ్రులకు చెప్పిన ఘటనలు ఎన్నో ఉన్నాయి. ఈ నేపథ్యంలో గత విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులు, తల్లిదండ్రులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలలు సైతం తాము చదువులు చెప్పలేమని ప్రభుత్వానికి అల్టిమేటం ఇవ్వగా కేవలం 25శాతం బకాయిలను మాత్రమే చెల్లించారు. రాష్ట్రవ్యాప్తంగా 30వేల మంది విద్యార్థులు ఈ పథకం కింద చదువుతున్నారు. నాలుగేళ్లుగా ఈ పథకానికి సంబంధించిన బకాయిలు ప్రభుత్వం చెల్లించడంలేదు. జిల్లాలో 1500 మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థులు ఈ పథకం కింద విద్యాభ్యాసంచేస్తున్నారు. ఒక్కో విద్యార్థికి ఏడాది చదువుతో పాటు వసతి కల్పించేందుకు ప్రభుత్వం రూ.40వేలు చెల్లిస్తుంది. గత నాలుగేళ్లుగా ఈబకాయిలు పెండింగ్‌లో ఉంటున్నాయి. జిల్లాలో ఆరు పాఠశాలలకు ఈ స్కీం కింద ఎంపిక చేయగా నిధులు విడుదల కాకపోవడంతో మూడు స్కూళ్లు స్కీం నుంచి వైదొలగగా మరో మూడు స్కూళ్లు ప్రస్తుతం స్కీంలో ఉన్నాయి. ఈ స్కూళ్లకు సంబంధించిన 13 కోట్లపైనే బకాయిలు ప్రభుత్వం నుంచి రావాల్సి ఉంది. గత విద్యాసంవత్సరం ప్రారంభంలోనే విద్యార్థులు, తల్లిదండ్రులు ఆందోళన కార్యక్రమాలు నిర్వహించగా అధికారులు ప్రైవేట్ పాఠశాలలకు నచ్చజెప్పి విద్యాసంవత్సరం కొనసాగించేలా చేశారు. కానీ నిధులు విడుదలకాకపోవడంతో వచ్చే నూతన విద్యాసంవత్సరం ఈ స్కీం కింద చదువుతున్న విద్యార్థుల భవిష్యత్తుపై నీలి నీడలు కమ్ముకుంటున్నాయి. ఈ విషయంపై అధికారుల నుంచి స్పష్టతలేకపోగా పథకం కొనసాగుతుందా లేదా అనే విషయంలో తల్లిదండ్రులు ఆందోళన చెందుతున్నారు.



**-నాలుగేళ్లుగా పెండింగ్..**

ఆర్థికంగా వెనుకబడిన ఎస్సీ, ఎస్టీ పేద విద్యార్థులకు ఉన్నత వర్గాలతో సమానంగా కార్పొరేట్ స్థాయి విద్యను అందించేందుకు 2004లో బెస్ట్ అవైలబుల్ పథకాన్ని అప్పటి ప్రభుత్వం ప్రారంభించింది. మొదట్లో ఈ పథకానికి నిధుల కేటాయింపు సక్రమంగా జరగగా గత నాలుగేళ్లుగా నిధులు మాత్రం విడుదల కావడంలేదు. 2023 ఎన్నికలకు ముందు గత ప్రభుత్వం నుంచి నిధులువిడుదల కాకపోగా కొత్తగా ఏర్పడిన కాంగ్రెస్ ప్రభుత్వం సైతం పెండింగ్‌లో ఉన్న బకాయిలను విడుదల చేయడంలేదు. దీంతో ఈ స్కీం కింద ఉన్న ప్రైవేట్ పాఠశాలలు అప్పులుచేసి పాఠశాలలను నిర్వహించాల్సిన పరిస్థితి నెలకొంది. దీంతో కొన్ని పాఠశాలలు విద్యార్థులను దసరా, సంక్రాంతి సెలవులకు ఇళ్లకు వెళ్లినపుడు తిరిగి రావద్దని కరాఖండిగా చెప్పిన సందర్భాలు ఉన్నాయి. జిల్లాలో 5వ తరగతి నుంచి పదవ తరగతి వరకు ఈ పథకం కింద ఒక్కో తరగతి నుంచి 250 మంది చొప్పున 1500 మంది విద్యార్థులు చదువుతున్నారు. డే స్కాలర్ విద్యార్థులకు ఒక్కొక్కరికి ఏడాదికి రూ. 28వేలు, రెసిడెన్షియల్ విద్యార్థులకు రూ. 40వేలు ప్రభుత్వం చెల్లిస్తుంది. జిల్లాలో ప్రస్తుతం మూడు ప్రైవేట్ పాఠశాలల్లోనే ఈ పథకం కొనసాగుతుంది. రూ. 13 కోట్లపైనే బకాయిలు పెండింగ్‌లో ఉండడంతో ప్రైవేట్ పాఠశాలల యాజమాన్యాలు చేతులెత్తేస్తున్నాయి. విద్యార్థులకు భోజనం, చదువు కొనసాగించలేమని వెంటనే నిధులు విడుదల చేయాలని ప్రైవేట్ పాఠశాలలు కోరుతున్నాయి.

**-విద్యార్థులను ఇంటికి పంపుతున్న యాజమాన్యాలు**

?బెస్ట్ అవైలబుల్ స్కీం కింద చదువుతున్న విద్యార్థులకు సంబంధించిన బకాయిలను ప్రభుత్వం చెల్లించకపోవడంతో సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థులను మళ్లీ తిరిగి రావద్దని ఇతర స్కూళ్లలో జాయిన్ కావాలని ప్రైవేట్ యాజమాన్యాలు కరాఖండిగా చెబుతున్నాయి. కొన్ని పాఠశాలలు అయితే విద్యార్థులను ఇళ్లకు పంపిన ఘటనలు ఉన్నాయి. ప్రైవేట్ పాఠశాలల ఎదుట విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన కార్యక్రమాలు చేపట్టిన సందర్భాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పదవ తరగతి పూర్తయిన విద్యార్థులకు ఉన్నత చదువుల కోసం టీసీ, బోనఫైడ్, మెమోలు అవసరం ఉంటాయి. కానీ ప్రభుత్వం నుంచి బిల్లులు విడుదల కాకపోవడంతో ఆ విద్యార్థుల సర్టిఫికేట్లను ఇచ్చేందుకు ప్రైవేట్ యాజమాన్యాలు ఆసక్తిచూపడంలేదు. విద్యార్థులకు సంబంధించిన ఫీజులలో సగమైనా చెల్లిస్తే తప్ప.. ప్రైవేట్ యాజమాన్యాలు సర్టిఫికేట్లను ఇవ్వడం లేదు. నిరుపేద కుటుంబాలకు చెందిన విద్యార్థులు ఫీజులు చెల్లించలేక ఇబ్బందులు పడాల్సిన పరిస్థితులు ఉన్నాయి.

## ఏఐసీసీఅధ్యక్షుడు ఖర్గేతో సీఎం రేవంత్ రెడ్డి భేటీ! ఏం చర్చించారో

**-ఖర్గేతో ఏం చర్చించారన్న దానిపై పొలిటికల్ సర్కిల్ లో రకరకాల చర్చలు**



( మే - 31- హంస కలంవార్త )

ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గేను ఆదివారం ఉదయం సీఎం రేవంత్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. కర్ణాటక బీదర్ వెళ్లే క్రమంలో ఖర్గే శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ నోవాటెల్ హోటల్‌లో బస చేశారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ మీనాక్షి నటరాజన్ లు నోవాటెల్ వెళ్లి ఖర్గేతో గంటన్నర పాటు సమావేశం అయ్యారు. ఈ భేటీలో వారంతా ఖర్గేతో ఏం చర్చించారన్న దానిపై పొలిటికల్ సర్కిల్ లో రకరకాల చర్చలు సాగుతున్నాయి. రాష్ట్రంలో ప్రస్తుత రాజకీయ పరిణామాలు,ఎస్ఐఆర్ సహాప్రభుత్వ కార్యక్రమాలపై ఈ భేటీలో చర్చించినట్లు తెలుస్తుంది. రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి రెండున్నర సంవత్సరాలు పూర్తి కావడం జూన్ 2న రాష్ట్ర అవతరణ దినోత్సవం వేళ చేపట్టనున్న ప్రభుత్వ పథకాలు వంటి భవిష్యత్ కార్యక్రమాలపై చర్చించారని సమాచారం. అలాగే కేబినెట్ విస్తరణ, కొందరు మంత్రుల మార్పు, మరికొందరి మంత్రులు శాఖలమార్పులు వంటి విషయాలపై చర్చించినట్లుగా తెలుస్తుంది రేవంత్ రెడ్డి ఈ వారంలోనే రాహుల్ గాంధీ, కేసీ వేణుగోపాల్ తో కేబినెట్ విస్తరణపై చర్చించి జూన్ రెండోవారంలో కేబినెట్ విస్తరణ చేపడుతారని తెలుస్తోంది.

## ముగిసిన వేసవి సెలవులు...నేటి నుండి తరగతులు షురూ

( మే - 31- హంస కలంవార్త )




రాష్ట్ర విద్యార్థులకు ఇంటర్ బోర్డు కీలక అప్‌డేట్ జారీ చేసింది.సుదీర్ఘ వేసవి సెలవుల అనంతరం సోమవారం (జూన్ 1) నుంచి జూనియర్ కాలేజీలు పునఃప్రారంభమై,ఇంటర్మీడియట్ ఫస్ట్,సెకండ్ ఇయర్ విద్యార్థుల కోసం జూనియర్ కాలేజీల్లో సోమవారం నుంచి తరగతులు ప్రారంభం అవుతాయి.ఈ మేరకు ఇంటర్ బోర్డు అకడమిక్ క్యాలెండర్‌ను ఇప్పటికే విడుదల చేసింది.జూన్ 1 నుంచే ఇంటర్ ఫస్టియర్, సెకండియర్ క్లాసులు ప్రారంభిస్తామని ఇంటర్‌బోర్డు అధికారులు గతంలోనే వెల్లడించారు.మరోవైపు ఏపీలోనూ ఇంటర్ తరగతులు జూన్ 1వ తేదీ నుంచి ప్రారంభం కావల్సి ఉంది. అయితే మండే ఎండల తీవ్రత దృష్ట్యా వేసవి సెలవులను మరికొన్ని రోజులు పొడిగించారు. దీంతో ఏపీ రాష్ట్ర వ్యాప్తంగా జూనియర్ కాలేజీలు జూన్ 6వ తేదీ నుంచి మొదలవనున్నాయి.

**-తెలంగాణ ఓపెన్ టెన్త్, ఇంటర్ ఫలితాలు విడుదల**

తెలంగాణ ఓపెన్ స్కూల్ సొసైటీ (టిఓఎస్ఎస్) రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించిన టెన్త్ (ఎస్ఎస్సి), ఇంటర్మీడియట్ పరీక్షల ఫలితాలను తాజాగా విడుదల చేసింది.ఈ పరీక్షలకు హాజరైన వేలాది మంది విద్యార్థులు అధికారిక వెబ్‌సైట్‌లో అడ్మిషన్ నంబర్ లేదా లాగిన్ వివరాలను నమోదు చేసి మార్కులను డౌన్‌లోడ్ చేసుకోవచ్చు.ఈ ఏడాది ఏప్రిల్ నెలలో షెడ్యూల్ ప్రకారం పదో తరగతి,ఇంటర్మీడియట్ విద్యార్థులకు థియరీ,ప్రాక్టికల్ పరీక్షలను వేర్వేరు కేంద్రాల్లో నిర్వహించారు.ఓపెన్ టెన్త్ పరీక్షలు 36,863 మంది రాయగా..ఇందులో 26,542 మంది (72 శాతం) పాస్ అయ్యారు.ఇక ఓపెన్ ఇంటర్ పరీక్షలు 54,679 రాయగా.. ఇందులో 37,562 మంది (68.70 శాతం) పాస్ అయ్యారు.జూన్ 2 నుంచి 7 వరకు రీకౌంటింగ్ దరఖాస్తు చేసుకోవచ్చు.పదో తరగతి రీకౌంటింగ్ ఫీజు రూ.350,ఇంటర్‌కు రూ.400గా నిర్ణయించారు.

## జూనియర్ కళాశాల పనుల్లో స్పీడ్ పెంచండి: మంత్రి కోమటిరెడ్డి

( మే - 31- హంస కలంవార్త )



జిల్లాలోని కనగల్ మండల కేంద్రంలో రూ.6 కోట్ల వ్యయంతో నిర్మాణంలో ఉన్న ప్రభుత్వ జూనియర్ కళాశాల భవనాన్ని రాష్ట్ర రోడ్లు,భవనాలు మరియు సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి ఆదివారం ఆకస్మికంగా పరిశీలించారు.ఈ సందర్భంగా నిర్మాణ పనుల పురోగతిపై అధి కారులను మంత్రి ఆరా తీశారు.పనులు వేగంగా పూర్తి చేయాలని,ఎలాంటి జాప్యం సహించబోమని స్పష్టం చేశారు. "స్పీడ్ పెంచండ్రి...పనులు చకచకా పూర్త వ్వాలె" అంటూ అధికారులకు సూచనలు చేశారు. విద్యార్థుల భవిష్యత్తుకు సంబంధించిన కీలక ప్రాజెక్టు కావడంతో నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ పడవద్దని,అదే సమయంలో పనుల్లో ఆలస్యం కూడా ఉండకూడదని మంత్రి ఆదేశించారు.గ్రామీణ ప్రాంత విద్యార్థులకు నగర స్థాయి విద్యా సౌకర్యాలు అందిం చడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కళాశాల భవన నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేసి విద్యార్థులకు అందుబాటులోకి తీసుకు రావాలని సంబంధిత అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు, కాంట్రాక్టర్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## నల్లగొండలో వివిధ పోలీస్ కార్యాలయాల్లో ఎస్పీ ఆకస్మికంగా తనిఖీలు






**-డీఎస్పీ,టూ టౌన్ సీఐ కార్యాలయాల పనితీరుపై ఆరా**
**-కేసుల దర్యాప్తు పురోగతి,రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి**

( మే - 31- హంస కలంవార్త )

జిల్లా పోలీసు శాఖలో పరిపాలనా పనితీరు,కేసుల దర్యాప్తు పురోగతి,రికార్డుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించిన జిల్లా ఎస్పీ శరత్ చంద్ర పవార్ ఆదివారం నల్లగొండ డీఎస్పీ కార్యాలయం,టూ టౌన్ సీఐ కార్యాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా గ్రేవ్ కేసుల క్రైమ్ ఫైల్స్,పెండింగ్ కేసుల రికార్డులు, ముఖ్యంగా ఎస్సీ,ఎస్టీ,అట్రాసిటీ కేసులకు సంబంధించిన ఫైల్స్‌ను సవివరంగా పరిశీలించారు. బాధితులకు త్వరితగతిన న్యాయం జరిగేలా దర్యాప్తును వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హత్యలు, దోపిడీలు, మహిళలు, చిన్నారులపై నేరాలు, సైబర్ నేరాలకు సంబంధించిన కేసుల పురోగతిని సమీక్షించిన ఎస్పీ, పెండింగ్‌లో ఉన్న కేసులను త్వరగా ఛేదించాలని సూచించారు. ప్రతి కేసులో పటిష్టమైన ఆధారాలు సేకరించి నిందితులకు చట్టపరమైన శిక్షలు పడేలా దర్యాప్తు నాణ్యత ఉండాలని స్పష్టం చేశారు. సీసీటీఎన్ఎస్ నమోదు విధానం, డిజిటల్ రికార్డుల నిర్వహణ,కోర్టు డిస్పోజల్ కేసుల ఫాలోఅప్, వారెంట్ల అమలు తదితర అంశాలపై కూడా సమీక్ష నిర్వహించారు.ప్రజలకు పోలీస్ శాఖపై మరింత నమ్మకం పెరిగేలా అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఎలాంటి నిర్లక్ష్యం సహించబోమని,ప్రతి అధికారి ప్రజలకు అందుబాటులో ఉండి సమస్యలను త్వరితగతిన పరిష్కరించాలని ఎస్పీ ఆదేశించారు.ఈ తనిఖీల్లో డీఎస్పీ శివరాం రెడ్డి,టూ టౌన్ సీఐ రాఘవరావు, ఇతర పోలీసు అధికారులు,సిబ్బంది పాల్గొన్నారు.

## కాల్వవడ్డులో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని పునఃప్రతిష్టించాలి:వి.హనుమంతరావు

( మే - 31- హంస కలంవార్త )




ఖమ్మం నగరంలోని కాల్వవడ్డులో తొలగించిన మాజీ ప్రధాని రాజీవ్ గాంధీ విగ్రహాన్ని వెంటనే తిరిగి ప్రతిష్టించాలని మాజీ రాజ్యసభ సభ్యుడు,తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు వి.హనుమంతరావు డిమాండ్ చేశారు.రాజీవ్ గాంధీ వర్ధంతి సందర్భంగా మే 21కు ముందే,మే 20న విగ్రహాన్ని తొల గించడం బాధాకరమని ఆయన అన్నారు.కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖర్గే చేతుల మీదుగా ఆవిష్కరించిన ఈ విగ్రహాన్ని ఎక్కడికి తరలించారో తెలియకపోవడం విచారకరమని పేర్కొన్నారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పటికీ ఇలాంటి అంశాలపై స్పష్టత లేకపోవడం శోచనీయమని విమర్శించారు.కాల్వవడ్డులో రాజీవ్ గాంధీ విగ్రహాన్ని యథాస్థానంలో తిరిగి ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.ఈ నిరసన కార్యక్రమంలో ఐఎన్‌టీయూసీ జిల్లా అధ్యక్షుడు కొత్త సీతారాములు, తాళ్లూరి హనుమంతరావు, పీసీసీ జనరల్ సెక్రటరీ లక్ష్మణ్ యాదవ్, బోడపట్ల జానయ్య, గురువయ్య తదితర కాంగ్రెస్, ఐఎన్‌టీయూసీ నాయకులు పాల్గొన్నారు.

# టీమిండియా స్టార్ యువరాజ్ సింగ్ సరసన నేపాల్ క్రికెటర్




స్పోర్ట్స్ డెస్క్

టీమిండియా మాజీ ఆల్‌రౌండర్ యువరాజ్ సింగ్ పేరు చెప్పగానే ఓ రికార్డు గుర్తుకు వస్తుంది. అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఓవర్లో ఆరు సిక్సర్లు కొట్టిన తొలి ప్లేయర్‌గా యువీ రికార్డు సృష్టించాడు. టీ20 ప్రపంచ కప్ 2007లో భాగంగా సెప్టెంబర్ 19న ఇంగ్లాండ్‌తో జరిగిన మ్యాచ్‌లో ఘనత సాధించాడు. ఆ తర్వాత పలువురు ఆటగాళ్లు కూడా ఈ రికార్డును అందుకున్నారు. తాజాగా క్రికెట్ ప్రపంచంలో పసికూన అయినా నేపాల్ జట్టు నుంచి కూడా ఓ ప్లేయర్ ఈ అరుదైన రికార్డును అందుకున్నాడు.నేపాల్ స్టార్ ఓపెనర్ కుషాల్ భుర్టెల్ ఈ ఘనతను సాధించి, క్రికెట్ ప్రపంచాన్ని ఆశ్చర్యపరిచాడు. పురుషుల ఆసియా క్రీడాల టీ20 క్వాలిఫయర్-2026లో టోర్నీలో భాగంగా చైనాతో ఆదివారం (మే 31) జరిగిన మ్యాచ్‌లో భుర్టెల్ ఈ అరుదైన ఘనత సాధించాడు. ఈ మ్యాచ్‌లో ఇన్నింగ్స్ ప్రారంభం నుంచే దూకుడుగా ఆడిన భుర్టెల్ డ్రాగన్ కంట్రీ బౌలర్లపై విరుచుకుపడ్డాడు. ఇన్నింగ్స్ తొమ్మిదో ఓవర్‌లో చుయూయ్ చెన్ వేసిన ఆరు బంతులను వరుసగా సిక్సర్లుగా మలిచి అరుదైన రికార్డును తన ఖాతాలో వేసుకున్నాడు. మొత్తం 43 బంతుల్లోనే 129 పరుగులు చేసి చైనా బౌలర్లపై దండయాత్ర చేశాడు.

భుర్టెల్ ఇన్నింగ్స్‌లో ఏకంగా 16 సిక్సర్లు నమోదయ్యాయి. అనంతరం డెంగ్ జింకీ అతన్ని ఔట్ చేసినా అప్పటికే మ్యాచ్ పూర్తిగా నేపాల్ చేతుల్లోకి వెళ్లిపోయింది. ఫలితంగా నేపాల్ నిర్ణీత 20 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి ఏకంగా 313 పరుగుల అతి భారీ స్కోరు సాధించింది. 314 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చైనా ఆరంభం నుంచే ఒత్తిడికి గురైంది. నేపాల్ బౌలర్ల కట్టుదిట్టమైన ప్రదర్శన ముందు చైనా బ్యాటింగ్ కుప్పకూలింది. చైనా జట్టు కేవలం 92 పరుగులకే ఆలౌటైంది. గతంలో అంతర్జాతీయ క్రికెట్‌లో ఒకే ఓవర్లలో ఆరు సిక్సర్ల ఘనతను హెర్షల్ గిబ్స్, యువరాజ్ సింగ్, కీరన్ పోలార్డ్, జస్కరన్ మల్హోత్రా, దీపేంద్ర సింగ్ ఎయిరీ సాధించారు.

కాగా, సింగపూర్ వేదికగా జరుగుతున్న పురుషుల ఆసియా క్రీడల టీ20 క్వాలిఫయర్-2026 టోర్నీలో మొత్తం 8 జట్లు రెండు గ్రూప్‌లుగా విభజించబడి పోటీపడుతున్నాయి. నేపాల్, చైనా, ఖతార్, మలేసియా ఓ గ్రూప్-ఏలో ఉండగా.. బెహ్రెయిన్, హాంగ్‌కాంగ్, ఒమన్, సింగపూర్ గ్రూప్-బిలో పోటీపడుతున్నాయి.

# సింగపూర్ ఓపెన్‌లో సాత్విక్-చిరాగ్ చరిత్ర...


# ఫైనల్లో అద్భుత విజయంతో టైటిల్ కైవసం

- సింగపూర్ ఓపెన్ మెన్స్ డబుల్స్ టైటిల్ గెలిచిన సాత్విక్-చిరాగ్
- ఈ ఘనత సాధించిన తొలి భారత జోడీగా చారిత్రక విజయం
- ఫైనల్లో ఇండోనేషియా జోడీపై మూడు గేమ్‌ల పోరులో గెలుపు
- తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకున్న భారత ద్వయం
- రెండేళ్ల తర్వాత సాత్విక్-చిరాగ్ జోడీకి ఇదే తొలి టైటిల్



భారత స్టార్ బ్యాడ్మింటన్ జోడీ సాత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టి చరిత్ర సృష్టించారు. సింగపూర్ ఓపెన్ మెన్స్ డబుల్స్ టైటిల్‌ను కైవసం చేసుకున్న తొలి భారత ద్వయంగా నిలిచారు. ఆదివారం జరిగిన ఉత్కంఠభరిత ఫైనల్లో తొలి గేమ్ కోల్పోయినా అద్భుతంగా పుంజుకుని ఇండోనేషియాకు చెందిన ఫజర్ అల్ఫియాన్, మహమ్మద్ షోహిబుల్ ఫిక్రీ జోడీపై విజయం సాధించారు. గంటా 13 నిమిషాల పాటు సాగిన హోరాహోరీ పోరులో సాత్విక్-చిరాగ్ జోడీ 18-21, 21-17, 21-16 తేడాతో గెలుపొందింది. ఈ విజయంతో సాత్విక్-చిరాగ్ జోడీ రెండేళ్ల టైటిల్ నిరీక్షణకు తెరపడింది. 2024లో థాయ్‌లాండ్ ఓపెన్ గెలిచిన తర్వాత, ఈ జంట ఏకంగా నాలుగు ఫైనల్స్‌లో ఓడి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. ఈ గెలుపు వారి కెరీర్‌లో తొమ్మిదో వరల్డ్ టూర్ టైటిల్ కాగా, మూడో సూపర్ 750 టైటిల్ కావడం విశేషం. ప్రపంచ నాలుగో ర్యాంక్ జోడీ అయిన సాత్విక్-చిరాగ్, ప్రపంచ మూడో ర్యాంక్ ఇండోనేషియా ద్వయంతో జరిగిన ఈ మ్యాచ్ ఆరంభంలో తడబడింది. తొలి గేమ్‌ను కోల్పోవడంతో ఒత్తిడి పెరిగింది. అయితే, రెండో గేమ్ నుంచి భారత జోడీ పూర్తిగా పుంజుకుంది. తమదైన దూకుడైన ఆటతీరు, పదునైన స్మాష్‌లతో ప్రత్యర్థులను ఉక్కిరిబిక్కిరి చేసింది. రెండో గేమ్‌ను గెలిచి మ్యాచ్‌ను సమం చేయడమే కాకుండా, నిర్ణయాత్మక మూడో గేమ్‌లోనూ అదే ఆధిపత్యాన్ని కొనసాగించి చారిత్రక విజయాన్ని తమ ఖాతాలో వేసుకుంది. విజయం ఖరారైన వెంటనే సాత్విక్, చిరాగ్ ఆనందంతో కోర్టుపైనే పడిపోయి భావోద్వేగంతో సంబరాలు చేసుకున్నారు. సుదీర్ఘకాలం తర్వాత టైటిల్ గెలిచిన ఆనందాన్ని ఆస్వాదిస్తూ కోర్టులో నృత్యం చేశారు. ఈ టోర్నీ సెమీఫైనల్లో ప్రపంచ ఛాంపియన్లను ఓడించి ఫైనల్‌కు చేరిన ఈ జంట, తుది పోరులోనూ అద్భుత ప్రదర్శనతో అభిమానులను అలరించింది.

# ఆదాయ నిర్వహణకు 50/30/20 రూల్



డబ్బులు సంపాదిస్తే చాలదు. అవసరాలు, ఖర్చులు పోను మిగిలిన సొమ్మని జాగ్రత్తగా పొదుపు చేయాలి. ఆ పొదుపు చేసిన మొత్తాన్ని జాగ్రత్తగా పెట్టుబడులు పెట్టాలి. పొదుపు చేసిన మొత్తాన్ని ఒక్కసారిగా పెట్టుబడుల్లో పెట్టకుండా.. కొంత మొత్తాన్ని సేవింగ్స్ బ్యాంకు (ఎస్‌బీ) ఖాతాల్లో డిపాజిట్‌గా ఉంచుకోవాలి. దీర్ఘకాలిక ఆర్థిక భద్రత, స్థిరత్వాన్ని ఇవ్వడంలో ఈ చర్య కీలక పాత్ర పోషిస్తుంది. అయితే ఎస్‌బీ ఖాతాలో ఎంత సొమ్ము ఉంచాలి? అనేది పెద్ద ప్రశ్న. రోజువారీ అవసరాలకు సరిపోగా.. భవిష్యత్ ఆర్థిక లక్ష్యాల సాధనకు అవసరమైనంత ఈ ఖాతాల్లో ఉంచుకోవడం మంచిదని ఆర్థిక నిపుణుల సూచన.

**-50/30/20 రూల్‌పై అవగాహన**

పన్నులు పోగా మిగిలే నెలవారీ ఆదాయాన్ని అవసరాలు, కోరికలు, పొదుపు అని మూడు భాగాలుగా విభజించాలి. ఇందుకోసం చాలామంది ఇనట?వ్వెస్టమెంట్ నిపుణులు 50/30/20 అనే రూల్‌ను సూచిస్తుంటారు. ఈ రూల్‌ను పాటించడం వల్ల ఆర్థిక క్రమశిక్షణ ఏర్పడి మనీ మేనేజ్‌మెంట్ మరింత సులభమవుతుంది. ఈ 50/30/20 రూల్ ఎలా పని చేస్తుందంటే?

**-అవసరాల కోసం 50 శాతం**

రోజువారీ అవసరాల కోసం మీ నెలవారీ ఆదాయంలో 50 శాతం పక్కన పెట్టుకోవాలి. ఈ మొత్తం నుంచే ఇంటి అద్దె లేదా గృహ రుణ ఈఎంఐ చెల్లింపులు, విద్యుత్ బిల్లులు, ఇతర యుటిలిటీస్ బిల్స్ చెల్లించాలి. కిరాణా సరుకులు, రవాణా ఖర్చులు, ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లింపులు, తప్పించుకోలేని ఇతర ఖర్చుల చెల్లింపులకు కూడా ఈ మొత్తాన్నే ఉపయోగించాలి.

**-జీవన శైలి ఖర్చులకు 30 శాతం**

దండిగా సంపాదించినంత మాత్రాన సరిపోదు. ఒక తెలుగు సినిమాలో రావు గోపాల రావు చెప్పినట్టు 'మనిషన్నాక కొద్దిగా కళాపోషణ కూడా ఉండాలి'. లేకపోతే జీవితమంతా 'సంపాదించడం, కూడబెట్టడం'తోనే సరిపోతుంది. అప్పుడు జీవితం కూడా యాంత్రికంగా మారిపోతుంది. ఆ జీవితం నుంచి బయటికి రావాలంటే వారం పది రోజులకు ఒక్కసారైనా కుటుంబ సభ్యులతో సినిమా, షికార్లు, షాపింగ్‌తో పాటు బయట విందూ వినోదాలతో సేద తీరాలి. ఇంకా వీలైతే ఏడాదికి ఒక్కసారైనా ఏదైనా పుణ్య క్షేత్రానికి లేదా విహార యాత్రకు వెళ్లాలి. లేకపోతే కుటుంబ సభ్యులు కూడా ఇదేం ఖర్మరా బాబు' అని ఈసడించుకుంటారు. ఈ ఖర్చుల కోసం మీ నెలవారీ ఆదాయంలో కనీసం 30 శాతమైనా పక్కకు తీసి ఉంచుకోవడం మంచిది.

**-పొదుపు, పెట్టుబడుల కోసం 20 శాతం**

సంపాదించేటప్పుడే నాలుగు రాళ్లు వెనకేసుకోవాలి. లేకపోతే మలి వయసులో ఆర్థిక సమస్యలతో జీవితం నరకప్రాయమవుతుంది. ఈ విషయాన్ని దృష్టిలో ఉంచుకుని ప్రతి నెలా మీ ఆదాయంలో కనీసం 20 శాతమైనా పక్కన పెట్టుకోవాలి. ఈ మొత్తాన్ని భవిష్యత్ ఆర్థిక లక్ష్యాల సాధనకు దోహదం చేసే పెట్టుబడుల కోసం వాడుకోవాలి. ఎమర్జెన్సీ ఫండ్, రిటైర్మెంట్ పెట్టుబడులు, ప్రధాన ఆర్థిక లక్ష్యాల కోసం చేసే పొదుపు ఈ కోవలోకి వస్తాయి.

**-ఎస్‌బీ ఖాతాల ప్రాముఖ్యత**

సంపాదించిన సొమ్ములో కొంత మొత్తం దాచుకునేందుకు ఎస్‌బీ ఖాతాలు సురక్షితమైన మార్గం.పైగా ఈ ఖాతాల్లోని బ్యాలెన్స్‌పై కొద్దిగా వడ్డీ కూడా వస్తుంది. వ్యక్తుల ఆర్థిక భద్రత నిర్మాణంలో ఎస్‌బీ ఖాతాలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. రెగ్యులర్ ఎస్‌బీ ఖాతాలతో పాటు నిధుల సమీకరణ కోసం బ్యాంకులు ఇప్పుడు అధిక వడ్డీతో కూడిన వెసులుబాటుతో కూడిన ప్రత్యేక ఎస్‌బీ ఖాతాలు కూడా అందిస్తున్నాయి. ఈ ఖాతాలను సరిగా ఉపయోగించుకుంటే మీ ఆర్థిక లక్ష్యాల సాధన మరింత సులువవుతుంది.

## ఇషాన్ కిషన్‌ను దాటి అత్యధిక ధర పలికిన ఎంఐ ప్లేయర్




స్పోర్ట్స్ డెస్క్

టీమిండియా యంగ్ ప్లేయర్, సన్ రైజర్స్ హైదరాబాద్ స్టార్ ఆటగాడు ఇషాన్ కిషన్‌కు జార్ఖండ్ టీ20 లీగ్ వేలంలో ఊహించని షాక్ తగిలింది. ఐపీఎల్ 2026లో పరుగుల వరద పారించిన ఇషాన్‌ను వెనక్కినెట్టి, ముంబై ఇండియన్స్ జట్టులో ఉన్న ఓ సాధారణ ప్లేయర్ అయిన రాబిన్ మింజ్ అత్యంత ఖరీదైన ఆటగాడిగా నిలిచాడు. మే 30న జార్ఖండ్ రాష్ట్ర క్రికెట్ సంఘం ఆధ్వర్యంలో తొలి జార్ఖండ్ టీ20 లీగ్ మెగా వేలం ఘనంగా జరిగింది.రాంచీ వేదికగా జరిగిన జార్ఖండ్ టీ20 లీగ్ వేలంలో రాంచీ టైటాన్స్, జంషెడ్‌పూర్ స్టీలర్స్, చోటా నాగ్‌పూర్ రాయల్స్, కోయలాంఛల్ సూపర్‌కింగ్స్, ధన్‌బాద్ డైమాండ్స్, సంథల్ స్ట్రయికర్స్ అనే ఆరు ఫ్రాంచైజీలు పాల్గొన్నాయి. ఈ వేలంలో అన్ని జట్లు తలో రూ.50 లక్షల బడ్జెట్‌తో ఆటగాళ్లను కొనుగోలు చేశాయి. ఈ ఆక్షన్‌లో ముంబై ఇండియన్స్ ఆటగాడు రాబిన్ మింజ్‌ను దక్కించుకునేందుకు అన్ని జట్లు తీవ్రంగా పోటీ పడ్డాయి. చివరకు కోయలాంఛల్ సూపర్ కింగ్స్ అతడిని రూ.15.25 లక్షలకు సొంతం చేసుకుంది. దీంతో ఈ టోర్నీ చరిత్రలోనే అత్యధిక ధర పలికిన ఆటగాడిగా రాబిన్ మింజ్ రికార్డు సృష్టించాడు. మరోవైపు టీమిండియా పాకెట్ డైనమైట్ ఇషాన్ కిషన్‌ను సంథల్ స్ట్రయికర్స్ రూ.14.70 లక్షలకు కొనుగోలు చేసింది. రాబిన్ మింజ్‌తో పోలిస్తే ఇషాన్ ధర రూ.55 వేల తక్కువగా ఉండటం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. దేశీయ క్రికెట్‌లో రాబిన్‌కు పవర్ హిట్టర్ అనే పేరు ఉంది. ఆ ఇమేజ్ అతడిని ఇషాన్ కంటే ఎక్కువ మొత్తానికి అమ్ముడుపోయేలా చేసింది. అలానే ఇషాన్ జాతీయ జట్టు బాధ్యతల కారణంగా ఈ టోర్నీలో కొన్ని మ్యాచ్‌లకు దూరమయ్యే అవకాశం ఉండటం కూడా వేలంపై ప్రభావం చూపినట్లు తెలుస్తోంది. కాగా, జార్ఖండ్ టీ20 లీగ్ జూన్ 10 నుంచి ప్రారంభం కానుంది. ఈ లీగ్‌లో మొత్తం 27 మ్యాచ్‌లు జరగనున్నాయి.

# సైయెంట్ చేతికి టావో డిజిటల్



హైదరాబాద్

హైదరాబాద్ కేంద్రంగా ఉన్న సైయెంట్ లిమిటెడ్.. వ్యాపార విస్తరణలో భాగంగా అమెరికాకు చెందిన టావో డిజిటల్ సొల్యూషన్స్ ఇంక్‌ను పూర్తిగా కొనుగోలు చేయనుంది. కాలిఫోర్నియాలోని శాంటా క్లారా ప్రధాన కేంద్రంగా ఏఐ-నేటివ్ డేటా, ప్రొడక్ట్ ఇంజనీరింగ్ సొల్యూషన్లు అందిస్తున్న టావోను కొనుగోలు చేయడానికి ఒప్పందం కుదుర్చుకున్నట్టు సైయెంట్ శనివారం ప్రకటించింది. ఈ డీల్ విలువ 21.8 కోట్ల డాలర్లు (సుమారు రూ.2,071 కోట్లు). ఈ కొనుగోలు ప్రక్రియ ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం నాటికి పూర్తయ్యే అవకాశం ఉందని సైయెంట్ తెలిపింది. 2022లో ఏర్పాటైన టావో డిజిటల్.. అమెరికా, కెనడా, భారత్, తైవాన్, యూరప్ దేశాల్లో విస్తరించి ఉంది. ఆటోమోటివ్, హై-టెక్, హెల్త్‌టెక్ తదితర రంగాల్లోని గ్లోబల్ కంపెనీల సంక్లిష్ట వ్యాపార, సాంకేతిక సవాళ్లకు పరిష్కారాలు ఈ కంపెనీ అందిస్తోంది. డేటా ఇంజనీరింగ్, ఏఐ ఆధారిత ప్లాట్‌ఫామ్ సొల్యూషన్స్, డిజిటలైజేషన్, క్లౌడ్ సర్వీసట?సలో ఈ కంపెనీకి ప్రత్యేక నైపుణ్యం ఉంది. ప్రస్తుతం ఈ కంపెనీలో 3,500 మందికి పైగా ఉద్యోగులు ఉన్నారు.

# సమంతతో బంధంపై అసత్య ప్రచారాలు.. ఢిల్లీ హైకోర్టుకు నటుడు నాగ చైతన్య

**వ్యక్తిగత హక్కుల రక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించిన నాగచైతన్య**

**సమంతతో బంధంపై జరుగుతున్న అసత్య ప్రచారాలకు అడ్డుకట్ట వేయాలని పిటిషన్**

**చైతూ ప్రతిష్ఠకు భంగం కలిగించే కంటెంట్‌పై కోర్టు మధ్యంతర నిషేధాజ్ఞలు**

**అభ్యంతరకర కథనాలు ప్రచురించిన పలు వెబ్‌సైట్లకు నోటీసులు జారీ**

**ఇద్దరూ కొత్త జీవితం ప్రారంభించినా ఆగని ఆన్‌లైన్ వేధింపులపై చట్టపరమైన చర్యలు**

టాలీవుడ్ ప్రముఖ నటుడు అక్కినేని నాగచైతన్య తన వ్యక్తిగత హక్కుల (పర్సనాలిటీ రైట్స్) పరిరక్షణ కోసం ఢిల్లీ హైకోర్టును ఆశ్రయించారు. నటి సమంత రుత్ ప్రభుతో తన గత బంధాన్ని ఉద్దేశించి కొన్ని వెబ్‌సైట్లు, యూట్యూబ్ ఛానెళ్లు చేస్తున్న అసత్య ప్రచారానికి అడ్డుకట్ట వేయాలని కోరుతూ ఆయన పిటిషన్ దాఖలు చేశారు. ఈ పిటిషన్‌ను విచారించిన జస్టిస్ జ్యోతి సింగ్ నేతృత్వంలోని ధర్మాసనం నాగచైతన్య ప్రతిష్ఠకు భంగం కలిగించేలా ఆయన పేరు, ఫొటోలు, వీడియోలను వాడొద్దంటూ మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. పలు వెబ్‌సైట్లకు నోటీసులు కూడా జారీ చేసింది.

నాగచైతన్య తరఫున సీనియర్ న్యాయవాది వైభవ్ గగ్గర్ వాదనలు వినిపించారు. "కొన్ని ఆన్‌లైన్ మాధ్యమాలు సమంతను చైతన్య మోసం చేశారని, ఆమె కెరీర్‌ను నాశనం చేశారని నిరాధారమైన కథనాలు ప్రచురిస్తున్నాయి. ఇది కేవలం విమర్శ కాదు, కచ్చితంగా వ్యక్తిగత వేధింపులు, ట్రోలింగ్ కిందకే వస్తుంది" అని కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయస్థానం, నటుడి ప్రతిష్ఠను కించపరిచేలా ఉన్న కంటెంట్‌పై చర్యలు తీసుకోవాలని ఆదేశించింది.





'ఏ మాయ చేసావె' (2009) సినిమా సమయంలో పరిచయమైన నాగచైతన్య, సమంత 2017లో వివాహం చేసుకున్నారు. అయితే, నాలుగేళ్ల వైవాహిక జీవితం తర్వాత 2021 అక్టోబర్‌లో పరస్పర అంగీకారంతో విడిపోతున్నట్లు ప్రకటించారు. ఆ తర్వాత ఇద్దరూ తమ జీవితాల్లో ముందుకు సాగారు. నాగచైతన్య 2024 డిసెంబర్‌లో నటి శోభితా ధూళిపాళ్లను, సమంత 2025 డిసెంబర్‌లో దర్శకుడు రాజ్ నిడిమోరును వివాహం చేసుకున్నారు.

ఇలా ఇద్దరూ కొత్త జీవితాలను ప్రారంభించి స్థిరపడినప్పటికీ, కొందరు పాత విషయాలనే పదేపదే ప్రస్తావిస్తూ ఆన్‌లైన్‌లో వ్యక్తిగత దూషణలకు పాల్పడుతుండటంపై నాగ చైతన్య న్యాయస్థానాన్ని ఆశ్రయించారు.

## నచ్చని పనికి 'నో' చెప్పడమే నా సక్సెస్: యామీ గౌతమ్



నమ్మకం లేని పాత్రలకు 'నో' చెప్పడమే తన ఎదుగుదలకు కారణమన్న యామీ గౌతమ్ 'ఊరి', 'బాలా' చిత్రాల తర్వాత కెరీర్ పరంగా నిర్భయంగా మారానని వెల్లడి అవార్డుల కన్నా ప్రేక్షకుల అభిమానమే గొప్పదని వ్యాఖ్య బాలీవుడ్ నటి యామీ గౌతమ్ తన కెరీర్ విజయ రహస్యాన్ని మరోసారి పంచుకున్నారు. తాను నమ్మని పాత్రలు, కథలకు నిర్భయంగా 'నో' చెప్పడం నేర్చుకోవడం వల్లే వృత్తిపరంగా ఎదగగలిగానని ఆమె స్పష్టం చేశారు. ఇటీవలే మాతృత్వంలోకి అడుగుపెట్టినప్పటికీ, తన వృత్తిపరమైన నిర్ణయాల్లో ఎలాంటి మార్పు లేదని తెలిపారు. ఇటీవల ఓ ఇంగ్లీష్ పత్రికకు ఇచ్చిన ఇంటర్వ్యూలో యామీ ఈ విషయాలు వెల్లడించారు. "కెరీర్‌లో నిలదొక్కుకోవాలంటే కొన్నిసార్లు నమ్మకం లేని పనులకు కూడా 'నో' చెప్పడం నేర్చుకోవాలి. నా జీవితంలో ఆ మార్పు 2018లో 'ఊరి', 'బాలా' సినిమాల తర్వాత వచ్చింది. అప్పటి నుంచి నాకు నిజంగా నచ్చిన, నన్ను ప్రభావితం చేసే పాత్రలనే ఎంచుకుంటున్నాను. ఆ తర్వాతే నేను నిర్భయంగా ఉండటం మొదలుపెట్టాను," అని ఆమె వివరించారు. కేవలం ఉపాధి కోసం లేదా పరిశ్రమలో కనిపించడం కోసం సినిమాలు చేయనని గతంలోనూ యామీ స్పష్టం చేశారు. పనిలేకుండా ఉండటానికైనా సిద్ధమే కానీ, నమ్మకం లేని సినిమా మాత్రం చేయనని ఆమె గట్టిగా చెబుతారు. తనకు అవార్డుల కన్నా ప్రేక్షకుల ప్రేమే ముఖ్యమని యామీ పేర్కొన్నారు. "ప్రేక్షకుల ప్రశంసలకు మించిన పెద్ద అవార్డు మరొకటి లేదు. మిగతావన్నీ క్షణికమైనవి," అని ఆమె అన్నారు.

## ఆ సమయంలో 'పెద్ది' నుంచి తప్పుకుందామని అనుకున్నాను: శివ రాజ్ కుమార్



కన్నడ సూపర్ స్టార్ శివ రాజ్ కుమార్ తాను నటించిన 'పెద్ది' సినిమా గురించి ఒక భావోద్వేగ విషయాన్ని వెల్లడించారు. 2024లో తనకు క్యాన్సర్ నిర్ధారణ అయిన తర్వాత, ఈ ప్రాజెక్ట్ నుంచి తప్పుకోవాలని భావించినట్లు తెలిపారు. అయితే, దర్శకుడు బుచ్చిబాబు సానా సహా చిత్రబృందం తన స్థానంలో మరొకరిని తీసుకోకుండా, తాను కోలుకునే వరకు ఎదురుచూశారని ఆయన గుర్తుచేసుకున్నారు.

రామ్ చరణ్, జాన్వీ కపూర్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్న 'పెద్ది' సినిమా ప్రమోషన్లలో భాగంగా చెన్నైలో జరిగిన ప్రమోషన్స్ లో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా, "సినిమా నుంచి తప్పుకోవాలనుకుంటున్నాను అని చెప్పాను. కానీ బుచ్చిబాబు 'వద్దు, మీరే కావాలి' అన్నారు. వాళ్లు నా కోసం చాలా కాలం ఎదురుచూశారు. వారికి నా ధన్యవాదాలు" అని శివ రాజ్ కుమార్ పేర్కొన్నారు. దర్శకుడు బుచ్చిబాబు సానా కథ చెప్పిన రోజే రామ్ చరణ్‌తో కూడా మాట్లాడానని గుర్తుచేసుకున్నారు.

2024లో శివ రాజ్ కుమార్‌కు బ్లాడర్ క్యాన్సర్ ఉన్నట్లు తేలింది. దీంతో ఆయన అమెరికాలోని మయామిలో శస్త్రచికిత్స చేయించుకున్నారు. క్యాన్సర్ సోకిన బ్లాడర్‌ను తొలగించి, పేగులోని కొంత భాగంతో వైద్యులు కృత్రిమ బ్లాడర్‌ను ఏర్పాటు చేశారు. 2025 ప్రారంభంలో ఆయన క్యాన్సర్ నుంచి పూర్తిగా కోలుకుని తిరిగి షూటింగ్‌లలో పాల్గొంటున్నారు.

# 'ఫరెవర్ మై హీరో'.. నాన్నకు మహేశ్ బాబు భావోద్వేగ నివాళి

**సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా మహేశ్ బాబు భావోద్వేగ పోస్ట్**

**'ఫరెవర్ మై హీరో.. హ్యాపీ బర్త్ డే నాన్న' అంటూ నివాళి**

**తండ్రిపై తనకున్న ప్రేమను చాటుకున్న సూపర్ స్టార్**

**ఎమోషనల్‌గా స్పందిస్తున్న అభిమానులు, నెటిజన్లు**

సూపర్ స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా ఆయన కుమారుడు, స్టార్ హీరో మహేశ్ బాబు భావోద్వేగానికి గురయ్యారు. తండ్రిని గుర్తుచేసుకుంటూ సోషల్ మీడియాలో ఓ హృదయపూర్వక పోస్ట్ పెట్టారు. ఈ పోస్ట్ ప్రస్తుతం అభిమానుల మనసులను కదిలిస్తోంది.


నేడు (మే 31) సూపర్ స్టార్ కృష్ణ జయంతి. ఈ సందర్భంగా మహేశ్ బాబు తన అధికారిక సోషల్ మీడియా ఖాతా 'ఎక్స్' (ట్విట్టర్)లో 'ఫరెవర్ మై హీరో... హ్యాపీ బర్త్ డే నాన్న" అంటూ ఒక సందేశాన్ని పంచుకున్నారు. ఈ చిన్న వాక్యంలోనే తండ్రిపై తనకున్న అపారమైన ప్రేమను, గౌరవాన్ని మహేశ్ వ్యక్తం చేశారు. కృష్ణ భౌతికంగా దూరమైనా, ఆయన జ్ఞాపకాలు తనతో ఎప్పటికీ ఉంటాయని, తన దృష్టిలో ఆయనే నిజమైన హీరో అని మహేశ్ చెప్పకనే చెప్పారు.

తెలుగు సినీ పరిశ్రమలో కృష్ణ-మహేశ్‌బాబులది ప్రత్యేకమైన బంధం. తండ్రీకొడుకుల అనుబంధానికి వారిద్దరూ నిలువుటద్దంలా నిలిచారు. కృష్ణ



మరణానంతరం ప్రతి సందర్భంలోనూ మహేశ్ ఆయన్ను స్మరించుకుంటూనే ఉంటారు.

ప్రస్తుతం మహేశ్ పెట్టిన ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. ఇది చూసిన అభిమానులు, నెటిజన్లు సైతం భావోద్వేగానికి గురవుతున్నారు. సూపర్ స్టార్ కృష్ణను గుర్తుచేసుకుంటూ కామెంట్లు పెడుతూ తమ అభిమానాన్ని చాటుకుంటున్నారు.



# 'హాట్, బ్యూటిఫుల్' అంటూ ఆ ఆర్ఆర్ క్రికెటర్ నాకు తరచూ మెసేజ్‌లు పంపాడు.. బ్లాక్ చేశా

ఓటీటీ వెబ్ సిరీస్‌లతో గుర్తింపు తెచ్చుకున్న నటి నేహల్ వదోలియా మరోసారి వార్తల్లో నిలిచారు. ఓ ప్రముఖ క్రికెటర్ తనకు సోషల్ మీడియాలో వ్యక్తిగతంగా మెసేజ్‌లు పంపారంటూ ఆమె చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం చర్చనీయాంశమయ్యాయి. ఈ వ్యాఖ్యలతో ఆ క్రికెటర్ ఎవరనే దానిపై ఆన్‌లైన్‌లో పెద్ద ఎత్తున చర్చ మొదలైంది. ఇటీవల 'సునో ఇండియా పాడ్‌కాస్ట్'లో పాల్గొన్న నేహల్‌ను.. "ఏదైనా క్రికెటర్ మీకు ఎప్పుడైనా డైరెక్ట్ మెసేజ్ చేశారా?" అని అడగ్గా, ఆమె నవ్వుతూ "పేరు చెప్పేయమంటారా?" అని బదులిచ్చారు. ఆ తర్వాత "అతను అంత పాప్యులర్ కాదు, రాజస్థాన్ రాయల్స్ జట్టుకు చెందినవాడు. అతనికి విడాకులు కూడా అయ్యాయి" అని కొన్ని క్లూస్ ఇచ్చారు. ఎలాంటి మెసేజ్‌లు పంపేవాడని ప్రశ్నించగా.. తన సోషల్ మీడియా స్టోరీస్‌కు తరచూ రియాక్ట్ అయ్యేవాడని, తన అందాన్ని పొగుడుతూ 'హాట్','బ్యూటిఫుల్','ప్రెట్టీ' వంటి మెసేజ్‌లు పంపేవాడని నేహల్ వివరించారు. అయితే, తనకు ఆ సంభాషణ కొనసాగించడం ఇష్టం లేకపోవడంతో స్పందించలేదని తెలిపారు. "నేను మెసేజ్ చేస్తే అతను మళ్లీ మొదలుపెడతాడు. అందుకే నాకు మాట్లాడటం ఇష్టం లేదు" అని చెప్పిన నేహల్.

Edited, Printed,Published and Owned by Vadla Madhusudhan chary, H. NO. 42-397 Anjaiah- Nagar, Behind Hanuman temple, ALLWYN COLONY Medchal Malkajgiri, Telangana 500037, Printed at NALIVELLI EXPRESS, PUBLISHED FROM HNo1-1A9T-10,Main road, pattikonda kurnool, Andhrapradesh 518380, Cell.No.9966555449